నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 11 జనవరి 2025 | www.navatelangana.com

సీపీఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేటలో సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు రిటైర్డ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విమల సీపీఐ నాయకులతో కలిసి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద మాట్లాడు తూ.. ముత్యాల ముగ్గులు, సంక్రాంతి పండగను అందరు ఆనందంగా జరుపుకునేందుకు ముగ్గుల పోటీలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ముగ్గుల పోటీలు దోహద పడతాయాన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు షఫీ అహ్మద్, ముస్తాఫా,శంకరప్ప, సంజీవ్ రెడ్డీ, రమేష్, బుజ్జమ్మ అనుసూజ, బిపాషా, సాధిక్ అలీ, మేఘన, అలంకృత, హేమలత, నాగలక్ష్మి, మాధవి,హిందు,రాణి తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రాంత అభివృద్ధికి నవతెలంగాణ తోడ్పడాలి

జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ ప్రాంతంలోని దీర్ఘకాలిక సమస్యలను గుర్తిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి ఈ ప్రాంతా అభివృద్ధికి 'నవతెలంగాణ' పత్రిక తోడ్పడాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లో నవతెలంగాణ 2025 క్యాలెండర్‌ను నవతెలంగాణ రిపోర్టర్ సంపత్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నవతెలంగాణ పత్రిక ప్రజా ప్రతినిధిగా పని చేయాలన్నారు. నవతెలంగాణ ప్రజల పక్షాన ఉండి పనిచేయాలని తెలిపారు. నవ తెలంగాణ పాఠకులకు, ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



- దరఖాస్తులు అధికం...కేటాయింపులు కొంచెం
- 7.4 లక్షల దరఖాస్తులు...40 వేల మందికే ఛాన్స్
- ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తలనొప్పులు
- అర్హుల్ని తేల్చే విషయంలో అధికారులకు తిప్పలు
- కేటాయింపులు తక్కువ...పేదలెక్కువ
- పూర్తి కావస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఇందిరమ్మ ఇళ్ల కోసం 7 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా సర్కార్ మాత్రం 40 వేల మందికే కేటాయించే ఛాన్స్ ఉంది. ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను మాత్రమే కేటాయించింది. కానీ..! నియోజకవర్గంలో 60-70 వేల వరకు పేదలు దరఖాస్తు చేసుకున్నారు. ఏ ప్రాతిపదికన ఎవర్ని అర్హులుగా గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తారో..? అనే ఉత్కంఠ నెలకొంది. ఇంటింటి సర్వే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సర్వే రిపోర్టు ఆధారంగా అర్హులైన లబ్ధిదారుల్ని గుర్తించే బాధ్యత అధికారులపై పెట్టారు. ఊరికో కోడి ఇంటికో ముక్క అన్నట్లుగా సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు చేయడంతో ఎవర్ని అర్హులుగా తేల్చాలనేది అధికారులకు కత్తిమీది సాములా మారిందంటున్నారు.

7 లక్షల దరఖాస్తులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తుల్ని స్వీకరించారు. అందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా దరఖాస్తు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 318775 దరఖాస్తులొచ్చాయి. మెదక్ జిల్లాలో 191100, సిద్దిపేట జిల్లాలో 230493 మంది దరఖాస్తు చేశారు. మూడు జిల్లాల్లో కలిపి 740368 మంది ఇళ్లులేని పేదలు దరఖాస్తు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో 60 నుంచి 65 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాకు 40 వేల ఇళ్ల కేటాయింపు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు జరుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో హుస్నాబాద్‌ను కలుపుకుంటే 11 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ లెక్కన ఉమ్మడి మెదక్ జిల్లాకు 38500 ఇళ్లు కేటాయించారు. వీటితో పాటు జనగాం నియోజకవర్గంలోని చేర్యాల, దుల్మిట్ట, మద్దూరు, కొమురవెల్లి మండలాలు సిద్దిపేట జిల్లాలో ఉన్నాయి. బెజ్జంకి కూడా మానుకొండూరు నియోజకవర్గమైనా సిద్దిపేట జిల్లాలో ఉన్నది. వీటికి కూడా ఆ నియోజకవర్గంలో కేటాయించిన ఇళ్ల నుండి వచ్చే వాటా కలుపుకుంటే ఉమ్మడి జిల్లాకు 40 వేల ఇళ్ల వరకు కేటాయించే అవకాశముంది.

పూర్తి కావస్తున్న సర్వే ప్రక్రియ

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. నెల రోజులుగా అధికారులు ఇంటింటికీ తిరుగుతూ దరఖాస్తు దారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తులో పేర్కొన్న వివరాలు, ఇంటి స్థలం పత్రాలను సేకరించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 95 శాతం పూర్తయ్యింది. మెదక్ జిల్లాలో 191100 దరఖాస్తులకు 183500, సిద్దిపేట జిల్లాలో 230483 దరఖాస్తులకు 21800, సంగారెడ్డి జిల్లాలో 318775 దరఖాస్తులకు 300100 వరకు దరఖాస్తుల సర్వే పూర్తయ్యింది. సర్వే పూర్తయిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

లబ్ధిదారుల ఎంపికే జటిలం

ఒక్కో నియోజకవర్గంలో వచ్చిన దరఖాస్తులు, కేటాయించిన ఇళ్ల సంఖ్యను చూస్తే చాలా తేడా ఉంది. ఒక్కో నియోజకవర్గంలో 60 నుంచి 71 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం మాత్రం తొలి దశలో కేటాయించిన ఇళ్లను మాత్రమే మంజూరు చేయనుంది. ఆ మేరకే బడ్జెట్ కేటాయింపులు చేసింది. దీంతో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల మేరకే లబ్ధిదారుల్ని ఎంపిక చేయాల్సి ఉంది. దీంతో అధికారులు ఎవర్ని అర్హులు..? ఎవర్ని తిరస్కరించాలో..? అర్థం కాక తలలు పట్టుకోవాల్సి వస్తుంది. ఒక పక్క దరఖాస్తులు అధికంగా ఉండడమే కాకుండా మరో పక్క అధికార పార్టీ నుంచి అనుయాయులకు చోటు కల్పించాలనే వత్తిళ్లు వస్తాయని అధికారులు గుసగుసలాడుతున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలేశారు. సంక్రాంతి తర్వాత గ్రామ సభలు పెట్టి లబ్ధిదారుల్ని ఎంపిక చేస్తామని చెబుతున్నా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఎంపిక ప్రక్రియ కొనసాగే ఛాన్స్ ఉంది. డబుల్ ఇళ్ల కేటయింపుల్లోనూ రాజకీయ ఎంపికలే జరిగాయి. ఇందిరమ్మ ఇళ్లు సైతం అట్లనే జరిగితే అర్హులకు అన్యాయం జరిగే ప్రమాదముంది.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు

ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించనుంది. లబ్ధిదారులు ఎంపికైన తర్వాత ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభించాక దశల వారిగా పేమెంట్ చెల్లించేలా ఏర్పాట్లు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన సిమెంట్, ఐరన్, ఇసుక, కలప, మేస్త్రీ, కూలీలు, రంగులు ఇతర మెటీరియల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో నిర్మాణ వ్యయం భారీగా పెరుగుతుంది. గత ప్రభుత్వంలో నిర్ణయించిన రూ.5 లక్షలు మాత్రమే ఇస్తామంటుంది. ధరలు పెరిగినందున ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

'ఫన్ టీ' స్టాల్ ప్రారంభోత్సవంలో నిర్మల జయప్రకాశ్‌రెడ్డి



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ గౌనిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫన్ టీ స్టాల్‌ను టీజీఐఐసీ చైర్మెన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యువత స్వయం కృషితో ఎదిగి, నలుగురికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ గడిల ఆశీరెడ్డి, కౌన్సిలర్లు శంకర్ గౌడ్, నాగరాజుగౌడ్, గుండు రవి, పిల్లోడి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కారసగుత్తిలో రేపు క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్దా మండలంలోని కారసగుత్తిలో రేపు(ఆదివారం) క్రికెట్ టోర్నమెంట్ నిరహించనున్నట్టు మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్ పాటిల్ తెలిపారు. ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సరిహద్దున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా పాల్గొనాలని కోరారు. గెలుపొందిన వారికి మొదటి బోహుమతిగా రూ.21,000, రెండో బహుమతిగా రూ.11,000 ఇవ్వనున్నట్టు చెప్పారు.

సెయింట్ ఆంథోనీస్‌లో ఎస్ఎల్‌సీ కార్యక్రమం



నవతెలంగాణ-సంగారెడ్డి

శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సీ(స్టూడెంట్స్ లెడ్ కాన్ఫరెన్స్) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఈ.కరుణాకర్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఈ.విజయ కుమార్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఈ.అరుణా రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి, భవిష్యత్తులో నూతన విద్యా ఆవిష్కరణల కై గట్టి ప్రయత్నంతో కృషిచేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఉపాధ్యాయులు తాము భోదిస్తున విద్యా బోధనాపద్దతి.. నూతన విధానంతో బోధించడం, ఎప్పటికప్పుడు చిన్న చిన్న ప్రశ్నలతో విద్యార్థుల మేధస్సును పరిశీలించి, అర్థం కాని వాటిని మరల బోధించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి

నవతెలంగాణ-నర్సాపూర్/శివ్వంపేట







లారీ బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట్ మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ (26) అతని స్నేహితుడు నాగరాజు (25) కొంపల్లి వెళ్లి వస్తున్న క్రమంలో నర్సాపూర్ ఎన్జీవోస్ కాలనీకి వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ బైకును బలంగా ఢీకొట్టింది. దీంతో అల్లిపూర్ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, నాగరాజులు అక్కడికక్కడే మృతి చెందారు. దుర్గాప్రసాద్‌కు భార్య, ఓ కూతురు ఉన్నారు. నాగరాజుకు భార్య మేఘమాలతో పాటు ఓ కూతురు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మరణించడంతో శివ్వంపేట మండలంలోని అల్లీపూర్ గామంలో పూర్తిగా విషాదచాయలు అలుముకున్నాయి. గ్రామమంతా శోకసముద్రంలో మునిగిపోయింది.

తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివపేట : తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం దర్శించు కున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వది నాన్ని పురస్కరించుకొని వెంకటే శ్వర స్వామిని దర్శించుకునీ ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు ముద్ద నాగ్‌నాథ్, మధు సుదన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పోరాట యోధుడు పండగ సాయన్న

నవతెలంగాణ-పటాన్‌చెరు



నిజాం రజాకర్లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాటయోధుడు పండగ సాయన్న అని నీలం మధు ముదిరాజ్ అన్నారు. వనపర్తి జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పాన్‌గల్ మండలం రాయినిపల్లిలో తనసొంత నిధులతో ఏర్పాటు చేసిన పండగ సాయన్న విగ్రహాన్ని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. పేద ప్రజలు ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాలలో పండగ సాయన్న అడుగు పెడితే వారి కడుపు నింపి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత వల్లే సాయన్న కు పండగ సాయన్న పేరు వచ్చిందన్నారు. పండగ సాయన్న సేవలను భావితరాలకు తెలియజేయాలని సంకల్పంతో పండగ సాయన్న విగ్రహలను ఊరూరా నెలకొల్పుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు పాల మూరు యూనివర్సిటీ కి పండగ సాయన్న పేరు పెట్టేలా చూడాలని ఆయన దృష్టికి తీసుకుని రాగా అందుకు సానుకూలంగా స్పందించి.. సీఎం దృష్టికి తీసుకొని వెళ్లి ప్రయత్నం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పగిడాల శ్రీనివాసులు, బెక్కం జనార్దన్, పండగ సాయన్న వారసులు యాదయ్య, నర్సింలు, సభాధ్యక్షులు శివ ప్రసాద్, దర్గేష్, నాయకులు మమత గౌడ్, పెబ్బేటి మల్లికార్జున్, వెంకటస్వామి,వాకిటి ఆంజనేయులు, చెన్న రాములు, పుట్ట బలంరాజు, మెట్టుకాడి శ్రీనివాస్, కృష్ణ, పండగ సాయన్న విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవసమాజ స్థాపన కోసమే 'ప్రజానాట్యమండలి పాట'



నవతెలంగాణ-సంగారెడ్డి

నవసమాజ స్థాపన కోసమే 'ప్రజానాట్యమండలి పాట' అని ఆ మండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జనవరి 23,24 తేదీల్లో ప్రజా సాంస్కృతిక ఉత్సవాలతో పాటు జనవరి 25, నుంచి 28 వరకు జరిగే సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదంగా నిర్వహించడం కోసం స్థానికంగా గల కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం ప్రజానాట్యమండలి రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరాల్లో మాట, పాట, ఆటతో కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరాలకు ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు రచయిత కామ్రేడ్ కాకం ఆంజనేయులు ప్రిన్సిపాల్‌గా వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. ప్రజానాట్యమండలి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు మట్టి మనుషులను ప్రజా పోరాటాలకు సిద్ధం చేసి దోపిడీ పీడనపై ప్రజలు తిరుగుబాటు చేసే విధంగా చైతన్యవంతమైన పాత్ర ప్రజానాట్యమండలి పోషిస్తుందన్నారు. దేశంలో దోపిడీ పీడన అంతరాలు లేని నవసమాజం, సోషలిస్టు సమాజ స్థాపన కోసం దేశంలో సీపీఐ(ఎం) చేస్తున్న కృషికి ప్రజానాట్యమండలి ఒక ఆయుధం లాగా ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకుపోయేదాంట్లో.. ప్రజలకు సోషలిస్ట్ చైతన్యం కల్పించే దాంట్లో ముఖ్యమైన పాత్ర పిఎన్ఎం పోషిస్తుందన్నారు. నేడు దేశంలో బూర్జువా కళలు సంస్కృతి దేశ ప్రజలను మూఢనమ్మకాల్లో ఉంచుతున్నాయన్నారు. దోపిడీపై తిరుగుబాటు చేయకుండా ప్రజల్లో విష సంస్కృతి విరజిమ్ముతున్నాయన్నారు. నవసమాజ నిర్మాణం కోసం జరుగుతున్న ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించే విధంగా ప్రజానాట్యమండలి పాటకు నాయకత్వం వహించే నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంజె వినోద్ కుమార్, ప్రజానా ట్యములు రాష్ట్రం సభ్యులు ముత్యాలు, ప్రభాకర్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి నాగ భూషణ్, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయు లు, సభ్యులు రాజు, యేసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ అభివృద్దే అంతిమ లక్ష్యం

రూ.16 కోట్లతో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి

నవతెలంగాణ-అమీన్‌పూర్



అమీన్‌పూర్ అభివృద్ధి తన అంతిమ లక్ష్యమని మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాల యంలో ఏర్పాటుచేసిన పాలకవర్గం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు చొరవ తీసుకుంటున్నామన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్‌లో వసతులతో పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.16.51 కోట్లతో ప్రత్యేక ప్రణాళి కలు రూపొ ందిస్తున్నామన్నారు. గత ఐదేండ్లలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, యూజీడీలు, విధి దీపాలు, పార్కుల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రతి ఇంటికి రక్షిత మంచి నీరు అందించడంలో సఫలీకృ తమయ్యామని చెప్పారు. కొత్త ఏర్పాటు అవుతున్న కాలనీల్లోనూ అభివృద్ధి పనులకు రూపకల్పన చేశామని తెలిపారు. అమీన్‌పూర్ అభివృద్ధిలో భాగస్వా మ్యులైన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో తీసు కెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ నందారం నర్సింహాగౌడ్, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, డిప్యూటీ ఈఈ వెంకటరమణ, ఏఈ ప్రవీణ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-జోగిపేట





సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయా లని ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. జె. వినోద్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకం అంజన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు, రచయితలు బూర్గుల ప్రభాకర్, ఏ నాగ భూషణం లు కోరారు. శుక్రవారం రాత్రి జోగిపేటలోని క్లాక్ టవర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొట్టమొదటి ఆంధ్ర మహాసభ జరుపుకున్న నేల జోగిపేట అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కూడా ఇక్కడ నుంచే పురుడు పోసుకుందని గుర్తు చేశారు. జోగిపేట ఉద్యమాల గడ్డ అని అన్నారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలను పరిశీలించి, వాటిపైన పాటలు రాసే ఆలోచనలు చేస్తున్నామన్నారు. ఇటీ వల శౌర్య యాత్ర కూడా జోగిపేటకు వచ్చిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఇక్కడి నుంచి ఎన్నో పోరా టాలు పురుడు పోసుకున్నాయి అన్నా రు. జోగిపేట ఎర్ర జెండాకు పుట్టినిల్లు అని, ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు ప్రజలు, రైతులు, పేదలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

గీతంలో సంక్రాంతి సంబురాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో శుక్రవారం వార్షిక పంటల పండుగ అయిన మకర సంక్రాంతి ఉత్సవాలను ఉత్సాహభరితంగా, ఆనందంగా నిర్వహించారు. గీతంలోని ఆతిథ్య విభాగం, స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్ నిర్వహించిన ఈ కార్యక్రమం మన దేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తూ, విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికితీయడం లక్ష్యంగా సాగింది. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు రంగు రంగుల సంప్రదాయ దుస్తులతో తరలి రావడంతో ప్రాంగణమంతా వర్ణశోభి తమైంది. ముగ్గుల (రంగోలి) పోటీ, ఎద్దుల బండి, సహజ పద్ధతిలో చెరుకు రసం వెలికితీసే పరికరం ఈ ఉత్సవాలలో ప్రధాన ఆకర్షణగా నిలిచి, పలువురిని ఆకట్టుకున్నాయి. మనదేశమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి, గీతంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కూడా పాల్గొన్న మోకు పందెం (టగ్-ఆఫ్ వార్) పోటీలు వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. రుచికరమైన మిఠాయిలు, పొంగల్, సేద తీర్చే చెరకు రసం వంటి వాటన్నింటినీ అరటి ఆకులలో బంతి భోజనంలా వడ్డించడం విశేషం. ఇక విద్యార్థులు గాలి పటాలను ఎగరవేయడం, సెల్ఫీలు తీసుకోవడంలో నిమగ్న మయ్యారు. మొత్తం మీద ఈ సంక్రాంతి వేడుకలు విద్యార్థులలో సామూహిక స్ఫూర్తిని పెంపొందించాయి.ఈ వేడుకలు విద్యార్థులలో సామాజిక భావన, సాంస్కృతిక స్ఫూర్తిని పెంపొందిం చడానికి తోడ్పడతాయని ఆతిథ్య విభాగం డిప్యూటీ డైరెక్టర్ అంబికా ఫిలిప్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులలో ఐకమత్యాన్ని చాటడానికి, వారసత్వాన్ని గౌరవించడానికి, మొత్తంగా అవన్నీ శాశ్వత జ్ఞాపకాలుగా నిలిచిపోవడానికి వీలుకల్పించాయన్నారు.

క్రీడల ప్రోత్సహకంలో ఖిజర్ యఫైకి ప్రత్యేక గుర్తింపు

నవతెలంగాణ-జహీరాబాద్



క్రీడలలో ప్రోత్సహించడంలో ఖిజర్ యఫైకి ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రసాద్ రెడ్డి అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో ఖిజర్ యఫై గోల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా శుక్రవారం చివరి లీగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, పారిశ్రామికవేత్త కె.ప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముల్తానీ పటేల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి, ఎండి ముల్తానీ పటేల్ మాట్లాడుతూ.. ఇంతచక్కటి టోర్నీని నిర్వహించి దేశ నలుమూలల నుంచి క్రీడాకారులను ఇక్కడకు రప్పించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా వేయి రూపాయల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. పేస్ బౌలర్ లోకేష్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ చైర్మెన్ రాములు నేత, అదం యఫై, అబుద్ యఫై, అబ్దుల్ సమద్, అబ్దుల్ సమి, నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సంతోష్ గుప్త, మొయి జుద్దీన్ లష్కరి, వ్యాఖ్యాతలు అబ్దుల్లా సిద్దిఖీ, మొహమ్మద్ ఫెరోజ్, మీడియా ఇంచార్జ్ సయ్యద్ మహేబూబ్ అలీ, రాకేష్ పబ్బతి, ప్రకాష్ మనియార్ పల్లి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, ప్రభుత్వానికి వారధి నవతెలంగాణ



నవతెలంగాణ-రామచంద్రాపురం

పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలను వెలికితీయడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వార్తలను ప్రచురించే పత్రిక నవతెలంగాణ దినపత్రిక అని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ అన్నారు. రామచంద్రాపురం పట్టణంలో నవతెలంగాణ నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఏమాత్రం భయపడకుండా ఉన్నది ఉన్నట్టు ప్రచురించడంలో నవతెలంగాణ దినపత్రిక మొదటి వరుసలో ఉంటుందన్నారు. ఎల్లప్పుడు ప్రజల బాగోగులను ఆశించే నవతెలంగాణ అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భర్త నాగేష్, రామచంద్రాపురం నవతెలంగాణ దినపత్రిక రిపోర్టర్ వాసుదేవ్, నాయకులు రాకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో వెనుకకు తీస్తుండగా కార్మికురాలికి ఢీ..

అక్కడికక్కడే మృతి.. దోమడుగు ప్రగతి పాలమర్స్ పరిశ్రమలో ఘటన

నవతెలంగాణ-గుమ్మడిదల



మండల పరిధిలోని దోమడుగు ప్రగతి పాలిమర్స్ పరిశ్రమలో దారుణం జరిగింది. మెటీరియల్ ఆటో వెనుకకు తీస్తుండగా కార్మికురాలికి బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ప్రగతి పాలవర్స్ పరిశ్రమలో అదే గ్రామానికి చెందిన భాగ్య(31) గత ఏడేండ్లుగా పనిచేస్తుంది. శుక్రవారం పరిశ్రమలో పని చేస్తుండగా.. అదే సమయంలో అక్కడికి వచ్చిన మెటీరియల్ ఆటో వెనక నుంచి ఆమెను బలంగా ఢీకొట్టింది. దాంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త కుమార్, ఓ కుమా రుడు, కుమార్తె ఉన్నారు. నిరుపేద కుటుంబమైన వారికి పరిశ్రమ యాజమాన్యమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు పరిశ్రమ ఎదుట ఆందోళన నిర్వహించారు. కాగా మృతిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జహీరాబాద్‌లో వర్కర్స్ కాలనీ ఏర్పాటు చేయాలి

ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ జహీరాబాద్



జహీరాబాద్ పరిధిలో వర్కర్స్, ఆటో వర్కర్లకు, డ్రైవర్లకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. జహీరాబాద్‌లో వందల సంఖ్యలో కార్మికులు, డ్రైవర్లు పేదలుగా ఉన్నారన్నారు. వారందరికీ జహీరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద ప్రత్యేకంగా ఇళ్ల స్థలాలు కేటాయించి వర్కర్స్ కాలనీ ఏర్పాటు చేయాలన్నారు. డ్రైవర్లు, కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని.. ఇంటి అద్దెలు కూడా చెల్లించలేకపో తున్నారన్నారు. వారందరికీ ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్ల స్థలాలు కేటాయించి.. నిర్మాణానికి 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంఘటితరంగంగా ఉన్న కార్మికులు పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకు డ్రైవర్లు, వర్కర్స్ కోసం వర్కర్స్ కాలని ఏరాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయ అనుబంధ యూనియన్ల నాయకులు ధనరాజ్, రాజు జావిద్, పాండు, ఫిరోజ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పై ఓవర్ బ్రిడ్జి పనుల పరిశీలన



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎంపీ సురేష్ షెట్కర్ సమీక్షా సమావేశంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు.. పనులను పరిశీలించినట్టు ఆర్డీవో రామ్‌రెడ్డి చెప్పారు. నాణ్యతా ప్రమాణాల్లో ఏ విధమైన లోపాలున్నా అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్శనలో విద్యుత్ స్థంబాల మార్పు, వంతెన రెండువైపుల రోడ్ల పూర్తి పనులు, నాణ్యతపై పరిశీలన చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేష్, ఆర్అండ్‌బి ఈఈ రాంబాబు, డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ సంధ్య, స్థానికులు డాక్టర్ నిస్సార్, సుధాకర్, సయ్యద్ అహ్మద్, అయూబ్ ఖాన్ (టిప్పు కరాంతి సేన), మహ్మద్ యూసఫ్ షరీఫ్, మొసా ఖాన్, మహ్మద్ సాబేర్ పాషా, మొయిజ్ లష్కరి తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ స్కాన్‌తో పోలీసుల పనితీరును తెలియజేయండి



నవతెలంగాణ-సంగారెడ్డి

పోలీసుల పనితీరును ఆన్‌లైన్లో క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తెలియ చేయాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ, పనితీరు, అవలంభిస్తున్న వివిధ రకాల కార్యక్రమాలపై ప్రజా అభిప్రాయ సేకరణకు గాను క్యూ ఆర్‌కోడ్‌ను ఆవిష్కరించినట్టు చెప్పారు.గతంలో పోలీస్ శాఖ, పనితీరు, అవలంబిస్తున్న సేవలపై ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాన్ని సేకరించేవారు, కానీ ఈ క్యూఆర్ కోడను స్కాన్ చేసి నేరుగా పోలీసుల వ్యవహార శైలి ఎఫ్ఐఆర్ నమోదు, ఈ చాలన్, మీ సేవ అప్లికేషన్స్ పాస్పోర్ట్ వంటి తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాన్ని తెలియజేయడానికి కోడ్ అందుబాటులో ఉంటుందన్నారు. స్వేచ్ఛగా ఈ క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాన్ని తెలియపరచాలన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన



నవతెలంగాణ-న్యాల్‌కల్

క్లస్టర్ పరిధిలోని కాకిజనవాడ గ్రామంలో శనగ, జొన్న పంటలను ఏఈఓ సాయికిరణ్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల్లో చీడపురుగుల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పచ్చ పురుగు సోకితే బెంజర్ 2 గ్రాముల ఫర్ లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని సూచించారు. పంటల సాగులో రైతులకు సందేహాల పట్ల గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించాలన్నారు. పంటల పరిశీలనలో రైతులు వెంకట్ రామ్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, మునీర్ ఉన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మనూర్

వివేకానందా స్వామి జయంతి సందర్భంగా పల్లవి మోడల్ పాఠశాల ఆవరణంలో రేపు(ఆదివారం) నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నారాయణ ఖేడ్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గంపాలి సిద్దార్థ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బీరదార్ దత్తులు కోరారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తందానం చేసి విజయవంతం చేయాలన్నారు.

సీఐ నరేష్‌ని కలిసిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన నరేష్‌ను మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పాండురంగారెడ్డి కోరారు. అమీన్‌పూర్‌లో శాంతి భద్రతలు ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటా యని, పోలీసుల నుంచి ప్రజలకు మంచి సహకారం అందించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి వెంట కౌన్సిలర్ కృష్ణ, సీనియర్ నేతలు ఉపేందర్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ లో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కందుల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఎ.సాయి చరణ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను ఆశ్రయించి మొసపోవద్దన్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు మార్కెట్‌లో కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ తిరుపతి రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు కడెం సుజాత, శేఖర్, వంశీ,జాఫార్, కిషన్ రాథొడ్, మల్లారెడ్డి,రైకోడ్ నర్సింహులు, శంకర్ పటేల్ పాల్గొన్నారు.

శ్రీ శ్లోక ఇంటర్నేషనల్‌లో సంక్రాతి సంబురాలు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీశ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో కేవిఆర్ పాఠశాల, శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాల వ్యవస్థాపకుడు కొత్వాల్ హరి కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ముగ్గుల పోటీ ఏర్పాటు చేయగా.. విద్యార్థుల మాతృమూర్తులు, ఉపాధ్యాయురాళ్ల పాల్గొన్నారు. సంక్రాతిని ప్రతిభంభించేలా వేసిన ముగ్గుకు ప్రథమ బహుమతి, ఆలోచనత్మాకంగా వేసిన ముగ్గుకు ద్వితీయ బహుమతి, సందేశంత్మకంగా వేసిన ముగ్గుకు తృతీయ బహుమతులను హరికృష్ణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు సంక్రాతి పండుగను ఆనందో త్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. అందరికి సంక్రాతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు లేక కుంటుబడుతున్న పంచాయతీలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

నిధులు లేక పంచాయతీల పాలన కుంటుబడుతున్నదని చీకుర్తి గ్రామ నాయకులు పట్లోల జనార్ధన్ రెడ్డి వాపోయారు. కర్ణాటక సరిహద్దు గ్రామాలపై అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. చీకుర్తి గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణతోపాటు చాలా సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. రోడ్డుపై మురుగునీరు పారుతున్నా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గౌతమ్ టెక్నో హైస్కూల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఇంద్రేశంలోని గౌతమ్ టెక్నో హైస్కూల్ నూతన సంవత్సర (2025) క్యాలెండర్‌ను పీఎస్ఆర్ టౌన్ షిప్ వ్యవస్థాపకులు పట్లోళ్ల నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను బోధిస్తూ, క్రమశిక్షణతో పాటు అంకిత భావంతో పని చేస్తున్న ఉపాధ్యాయ బృం దాన్ని ఆయన అభినందించారు. గౌతమ్ స్కూల్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ యు. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ.. విలువలతో కూడిన, అహ్లాదకరమైన వాతావరణంలో, మంచి క్రమ శిక్షణతో తమ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యాబోధన చేస్తున్నారన్నారు. అనంతరం పట్లోళ్ల నరసింహారెడ్డిని ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.లీలావతి, భోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదినారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-జిన్నారం

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలో గల ఆదినారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొడకంచి మాజీ సర్పంచ్ శెట్టి శివరాజ్, ఆదినారాయణ స్వామి ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ అల్లాని రామారావు పలువురు పాల్గొన్నారు.

హామీలు అమలు పరచాలని వినతులు..





నవతెలంగాణ-జిన్నారం, గుమ్మడిదల

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు అన్నింటిని అమలు పరచాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు జిన్నారంలో తహసీల్దార్ బిక్షపతికి, గుమ్మడిదలలో బీజేపీ మండల అధ్యక్షులు పలుగు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ తాహసిల్దార్ కర్ణాకర్ రావుకు వినతిపత్రాలు అందజేశారు. రైతు కూలీలకు రూ.12వేలు, రైతులకు పెట్టుబడి సాయం రూ.15వేలు, ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ ఇంకెప్పుడు అందుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిన్నారంలో సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, జిల్లా కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వి.రాజిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అంజిరెడ్డి, గుమ్మడిదలలో కిసాన్ మోర్చ మండల ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, మండల కిసాన్ మోర్చా రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఓపెన్ టు ఆల్ క్రీడా పోటీలు





నవతెలంగాణ-గుమ్మడిదల

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ట్రస్ట్ చైర్మెన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, నియోజవర్గ స్థాయి నాయకులు, అధికారులు, ట్రస్ట్ సభ్యులు, యువజన సంఘాల నాయకులు హాజరై క్రీడా జెండాను ఆవిష్కరించారు. అడిషనల్ ఎస్పీ సంజీవరావు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో 36 కబడ్డీ టీములు, 30 వాలీబాల్ టీమ్‌లు పాల్గొంటున్నట్టు చెప్పారు. క్రీడాకారులకు అకామిడేషన్, భోజన వసతులు కల్పించామన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలకు మొదటి నగదు బహుమతిగా రూ.50వేలు ద్వితీయ బహుమతిగా రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.15వేల అందజేయనున్నట్టు చెప్పారు. శాంతియుతమైన వాతావరణంలో పోటీలను నిర్వహించుకోవడానికి క్రీడాకా రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పటాన్చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ గంగాభవాని, ఎస్ఐ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ ఉమాదేవి, ట్రస్టు వైస్ చైర్మెన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, ముఖ్య సభ్యు లు చిమ్ముల నరసిం హారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, చిమ్ముల దేవేందర్ రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, యువజన సంఘాల నాయకులు వెంకటేశం గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయకోటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగనాయక స్వామి ఆలయంలో నీలం మధు పూజలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా శ్రీ రంగాపురం మండల కేంద్రంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఉత్తర ద్వారం ద్వారా రంగ నాయక స్వామిని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాపకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. శ్రీ రంగ నాయక ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయం చుట్టు ఉన్న రంగసముద్రం కొలను చూడమచ్చటగా ఉందన్నారు. దేవాలయ నిర్మాణలతో పాటు ఆలయాల అభివృద్ధికి సహకరించే విషయంలో తానెప్పుడూ ముందుంటా నన్నారు. అనంతరం శ్రీ రంగ సముద్రం తో పాటు రిజర్వాయర్ ను, మ్యూజియం ను సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్,డా,,పగిడాల శ్రీనివాస్, చొప్పరి వెంకట య్య, నరేష్, పి వెంకటయ్య, ఎం రఘు, ఆంజనేయులు, మూర్తి, కృష్ణయ్య, బిసన్న, కృష్ణ, ఈశ్వరయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి



నవతెలంగాణ-జిన్నారం

విద్యుత్ వినియోగదారులకు మరింతగా నాణ్యమైన సేవలను అందించాలని సంబంధిత శాఖ ఉద్యోగులు, అధికారులకు, క్రింది స్థాయి సిబ్బందికి పటాన్చెరు విద్యుత్ విభాగం డివిజనల్ ఇంజనీర్ భాస్కరరావు సూచించారు. మండల కేంద్రంలోని సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు సిబ్బందితో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు రైతులకు ఉత్తమమైన సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు.రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ లోపాలను సవరించుకోవడంతోపాటు విద్యుత్ డిమాండ్‌ని పెంచాలన్నారు. వినియోగ దారులకు విద్యుత్ నాణ్యమైన సేవలకు తోడుగా విద్యుత్ అంతరాయం లేకుండా అందించాలన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన పుడే విద్యుత్ బిల్లులు వసూలు చేయడానికి అవకాశం ఉంటుంద న్నారు. రవి సీజన్లో రైతాంగానికి నాణ్యమైన కరెంటును అందించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల ఎడిఈ దుర్గా ప్రసాద్, జిన్నారం మండల విద్యుత్ సహాయ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, బొంతపల్లి ఏ ఈ రవీందర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సదాశివపేట

పద్మశాలీ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయ ఆవరణలో రాష్ట్ర యువజన అధ్యక్షులు గందేమల్లె రాజు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలీ పట్టణ అధ్యక్షులు మునిపల్లి విశ్వనాథం మాట్లాడుతూ.. పద్మశాలిలకు సంబంధించిన మార్కండేయ భవన స్థలం అందరికీ చెందినదని, అందరికీ చెందే విధంగా కోర్టు ద్వారానైనా సాధించాలని పట్టణ కమిటీ తీర్మానించినట్టు తెలిపారు. అదేవిధంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మల్లయ్య మేస్త్రి లాడ్జ్ పక్కన ప్రతిష్టించాలని మళ్లీ తీర్మానించారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క పప్పీ, బుస శేఖర్, గుండు రవి, బిక్షపతి, ఒగ్గు గణేష్, పోల విజయ్ కుమార్, గున్నాల సత్యం, నాగారం గోపాల్, పాసి కంటి రమాకాంత్, మాదాసు నరేష్, వైద్యం పవన్, పాసికంటి రజనీకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు





నవతెలంగాణ-న్యాల్‌కల్

గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో క్రీడా ఆసక్తిని పెంపొందించడానికి వీలుగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు.. చెట్టు, ముళ్ల పొదలతో అడవులను తలపిస్తున్నారు. మండలంలోని మెటల్ కుంట, మామిడ్గి, శంశోల్లాపూర్, రాఘవపూర్, ఇబ్రహీంపూర్, మ్యరుజాపూర్ తదితర గ్రామాల్లో గల క్రీడా ప్రాంగణాలు.. చెత్త చెదారంతో నిండిపోయాయి. లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఏర్పాటు చేసినప్పటికీ.. పర్యవేక్షణా లోపంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయని యువకులు మండిపడుతున్నారు. క్రీడా సామాగ్రి కూడా క్షేత్రస్థాయిలో తమ వద్దకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారుల స్పందించి.. క్రీడా ప్రాంగణాలను బాగు చేయాలని కోరుతున్నారు.

ఆలయాల్లో ప్రముఖుల పూజలు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు సందర్శకులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. చాలా మంది ప్రముఖులు సైతం కుటుంబ సమేతంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలోని వైకుంఠపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు బీజేపీ రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, కొవ్వూరు సంగమేశ్వర్, బసవరాజ్ పాటిల్, హను మంత్ రెడ్డి, అనంత్‌రావు కులకర్ణి, రవిశంకర్, శ్రీశైలం యాదవ్, కల్వకుంట్ల యశ్వంత్, సందీప్ తదితరులు ఉన్నారు.

సదాశివపేట : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల శ్రీ గోదా సమేత అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పులి మామిడి రాజు ఆయన సతీమణి మమత, కుమారుడు మనోజ్‌లతో కలిసి ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శిం చుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను శాలు వాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ క్షత్రజ్ఞులు, అధ్యక్షులు చిల్వేరి వెంకటేశం, సభ్యులు సుధాకర్ గుప్తా, శ్రీనివాస్, రుమాండ్ల రాజు, జగదీశ్వర్ పంతులు, షోలాపురం రాజు, యాదయ్య ముదిరాజ్, వీరేందర్, పీఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

కంబాలపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని చింతా సాయినాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెద్దగొల్ల మల్లమ్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, కంబాలపల్లి మాజీ సర్పంచ్ శ్రీహరి, అంజిరెడ్డి, జంగయ్య గౌడ్, జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : బీదర్ పట్టణంలో ప్రసిద్ధి చెందిన కుంబర్వడ అగ్రారం అనంతపద్మనాభ స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి వైకుంఠ ఏకాదశి అనంత పద్మనాభ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్,పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, సర్వేశ్, సమల సంగాన్నా, శ్రీనివాస్, హన్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







ఆశాలకు కనీస వేతనం రూ.18,000 ఇవ్వాలి





నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్, జహీరాబాద్

ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు కనీస వేతనం రూ.18000 నిర్ణయించాలని, ప్రమోషన్లు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని.. ఈ మేరకు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో మాట్లాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నారాయణఖేడ్, జహీరాబాద్ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఖేడ్‌లో ఎమ్మెల్యే పీఏ వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వినోద్ పటేల్‌కు, జహీరాబాద్‌లో ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జహీరాబాదలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్, నారాయణఖేడ్‌లోడివిజన్ కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ..ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18000 ఇస్తామని ఆశ పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయ కులు.. నేడు ఆ హామీని పట్టించు కోకపోవడం దుర్మార్గ మన్నారు. ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు ఇస్తామన్నా హామిని నెరవేర్చాలన్నారు. స్పూటం డబ్బాలు మోయ్యడాన్ని రద్దు చేస్తూ గతంలో ఉత్తర్వులు జారీ చేసినా.. కొన్ని పీహెచ్సీల్లో తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ప్రతీ పిహెస్సి డాక్టర్లకు, మెడికల్ ఆఫీసర్లకు ప్రభుత్వం సర్క్యు లర్ ఇవ్వాలన్నారు. ఆశ వర్కర్లకు ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమో షన్ కల్పించాలని, వెయిటేజ్ మార్కులు కల్పించాల న్నారు. పెండింగ్లో ఉన్న లెప్రసి, పాల్స్ పోలియో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్య మాలు ఉత్పతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జహీరా బాద్‌లో ఆశా యూనియన్ జహీరాబాద్ క్లస్టర్ కార్య దర్శి శశి కళ, ఉపాధ్యక్షులు నందమ్మ, నాయకులు శ్యామల, లక్ష్మీ, బుజ్జమ్మా సంగీత, నిర్మల, ఆశా వర్కర్ల యూనియన్ వివిధ మండలాల అధ్యక్షు రాలు భారతి, విట్టా బాయ్, కృష్ణవేణి, రుక్మిణి, శ్యామల, రేష్మ, జోలిబాయ్, సుజాత, జ్యోతి పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల విరమణ వయస్సు పెంచాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించు కోవాలని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాల యంలో డీఆర్ఓ పద్మజా రాణికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో యువతకి యూత్ డిక్లరేషన్ పేరుతో 5 హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు. ప్రతీయేడు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ద్వారా నియమకాలు చేపడతామని, నిరుద్యోగ భృతి రూ.4000 ఇస్తామని, యూత్ కమిషన్ ఏర్పాటు చెస్తామని చెప్పిందని.. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆ హామీలను అమలు చేయలేదన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించారే తప్పా.. దాని ప్రకారం అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఆ హామీలను అమలు చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సు పెంచాలనే ప్రతిపాదన చేస్తోందని.. దాంతో రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు రాకుండా తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదన్నారు. గత పదేండ్ల నుంచి నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్నారని.. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల విరమణ వయస్సును పెంచాలనే ప్రతిపాదనను ఉపసంహరిం చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు కావడంతో.. శుక్రవారం రోజున చాలా పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని చిన్నారులు వేసుకొచ్చిన వేషధారణ అందరినీ ఆకర్షించింది. అలాగే ముగ్గుల పోటీలు నిర్వహించడం, పతంగులు ఎగురవేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు.

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండలంలోని కల్పగూర్ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ మాట్లాడుతూ.. పాడి, పసిడి పంట దండిగా పండాలని.. రైతుల ముఖంలో చిరునవ్వులు వెదజల్లాలని, ప్రజలందరు సంతో షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ ముగ్గుల పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాజీ ఉపసర్పంచ్ అజయ్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివపేట : సదాశివపేట పట్టణంలోని జీనియస్ స్కూల్ అఫ్ ఎక్సలెన్స్ స్కూల్ ఆవరణలో భోగిమంటలతో సంబురాలు నిర్వహించారు. గాలిపటాలు ఎగురవేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. అలాగే చిన్నారులకు భోగి పండ్లు పోసి పండగ సంప్రదాయాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ చైర్మెన్ కూచి శ్రీనివాస్, కరస్పాండెంట్ రఘువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రణీత రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిపల్లి : మండల పరిధిలోని బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి గొప్పద న్నారు. సంక్రాంతి పండుగ అందరూ సంతోషంగా జరుపు కోవాలని.. సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. సంక్రాతి పండుగ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, మారుతి, ఉదయ ప్రసాద్, కాటి అబ్బయ్య, సంజయ్, రమేష్, సిహెచ్ రవి లైబ్రేరియన్ మన్నే రమేష్, జూనియర్ అసిస్టెంట్ జి కవిత, హితేంద్రనాథ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : రేజింతల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు హెచ్ఎం సఫియా సుల్తానా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పతంగుల తయారీ పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మానస రెడ్డి, విద్యార్థులు ఉన్నారు.

జిన్నారం : మండల పరిధిలోని చాలా పాఠశాలలో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. గాలిపటాల ఎగరవేయడం, సంక్రాంతి ముగ్గుల రంగవల్లులు, ఇతరత్రా కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.











నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
శనివారం | 11 జనవరి 2025 | www.navatelangana.com

బీవీఆర్ఐటీ కళాశాలలో ఫైనల్ రేసింగ్ పోటీలు



నవతెలంగాణ-నర్సాపూర్ : నర్సాపూర్ పట్టణంలోని సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి విష్ణు నేషనల్ కాంక్రీట్ కా నో ఫైనల్ రేసింగ్ పోటీలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబే మాట్లాడుతూ ఈ పోటీలు 9న ప్రారంభమై నేటితో ముగిశాయన్నారు. ఈ పోటీలతో పాటు క్యాంపస్‌లో పడవ పోటీలు ఘనంగా ప్రారంభమైనాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ఛాన్సలర్ శ్రీ ఆర్ రవిచంద్రన్ రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టెక్నియాలజీకి అనుగుణంగా నిర్మాణ సామాగ్రి ఆచరణల ప్రాముఖ్యతపై దృష్టి సారించి ఇంజనీర్లు సిద్ధంగా ఉండాలన్నారు. పడవల ఇంజనీరింగ్ డివిజన్ పాల్గొన్న వారి నైపుణ్యం విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు . అనంతరం రేసింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, రాష్ట్రాల నుంచి 16 పైగా బృందాలు ఎండ్యూరెన్స్ రేసులో పాల్గొన్నాయి. బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ విజయవాడ, వాసవి కాలేజీ హైదరాబాద్, త్రిబుల్ ఐటీ కాలేజీ, విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శ్రీ విష్ణు ఇంజనీరింగ్ కాలేజీ, ఫర్ విమెన్ విజ్ఞాన భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మొదలైన ఇంజనీరింగ్ కాలేజీ లు పాల్గొన్నారు. డ్రోన్స్ ద్వారా ఈ ఇండోరెన్స్ పోటీలను పర్యవేక్షించి విజేతలకు బహుమతులు ప్రధాన చేశారు. మొదటి బహుమతి బివి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రెండో బహుమతి రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్, బాసర విద్యార్థుల మూడో బహుమతి,, విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భీమవరం, విజ్ఞాన భారతి ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ హైదరాబాద్ వారు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఎస్ కృష్ణారావు, అన్ని విభాగాల హెచ్ఓడీలు డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు ,అశోక్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఓ గారు.. మీటింగ్‌లకు వచ్చి చాయ్ తాగి వెళ్తున్నారా

- జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి ఆగ్రహం
- అధికారుల నిర్లక్ష్యంతోనే అవకతవకలు
- అధికారులతో వాగ్వాదానికి దిగిన కూలీలు
- సామాజిక తనిఖీకి హాజరైన డిఆర్డిఓ ఏపీడి రంగాచార్యులు



నవతెలంగాణ-కౌడిపల్లి

ఏపీఓగారు ఉపాధి హామీ కార్యాలయంలో చాయ్ తాగి ఇంటికి వెళుతున్నారా అని, ఇంత అక్రమాలు జరుగుతుంటే మీరేం చేస్తున్నారని జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి ఏపీఓ పుణ్యదాస్‌ను ప్రశ్నించారు. శుక్రవారం 15వ విడత సామాజిక తనిఖీ కౌడిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఆర్డిఓ అడిషనల్ పిడి రంగాచార్యులు హాజరయ్యారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024మార్చి31 వరకు జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల వివరాలు వెల్లడించారు. వెల్మకన్న గ్రామానికి చెందిన టిపి హర్య, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యాలును తొలగించాలని కూలీలు అధికారుల ముందు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులకు రాకుండానే డబ్బులు కాజేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనులకు రాకుండా ఇంటి దగ్గర ఉండి, జాబు చేసుకునే వారికి పనులు చేస్తున్నట్టు సంతకాలు చేస్తూ డబ్బులు డ్రా చేసుకోవడం ఏంటని అధికారుల ముందే నిలదీశారు. గత సంవత్సరం ఇలాగే జరిగిన అధికారులు సస్పెండ్ చేస్తూ డబ్బులు రికవరీ రాస్తున్నామన్నారు. కానీ నామ్‌కే వాస్తేగా సామాజిక తనిఖీ చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనులకు రాని వారి పేర్లు రాసి తామే సంతకాలు పెడుతూ డబ్బులు డ్రా చేసుకుంటున్నారని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటన్నారు. కూలి పనులు చేసి సంవత్సరం గడుస్తున్నా కొంతమందికి డబ్బులు చెల్లించలేదని పనులు చేయకుండా ఎక్కడో జాబ్ చేసుకుంటున్న వారికి మాత్రం వెంటనే డబ్బులు డ్రా చేస్తున్నారని అధికారుల ముందే వాగ్వాదానికి దిగారు. ఒకరి పేరు మీద మరొకరు పనిచేయటమేంటని, ఒక్కరే ఇతర జాబ్ కార్డులపై 300 రోజులు పనిచేయటమేంటని, పనిచేసిన వారికి డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంపై అధికారులకు విన్నవించారు.

సమాచారం ఇవ్వకుండానే సామాజిక తనిఖీలు

ఉపాధి పనుల వద్ద ఎంపీడీవో, ఏపీవో అధికారులు ఒక్కరోజు కూడా తనిఖీ చేయకనే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సామాజిక తనిఖీ ఉందని కూలీలకు చెప్పకుండానే తప్పిదాలు బయటపడతాయని ఉద్దేశంతో సమాచారం ఇవ్వకుండానే సామాజిక తనిఖీ నిర్వహించారని తోటి కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు స్పందిస్తూ ఏపీవో, ఎంపీడీవో, ఈసీ, టి ఏ లు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఏ ఒక్క జీపి లో కూడా రికార్డులు సక్రమంగా లేవని కనీసం సామాజిక తనిఖీ ఉందన్న భయం కూడా లేకుండా అధికారులు పనిచేయటం ఏంటని సామాజిక తనిఖీలో లోటుపాట్లు ఉంటే వారిపై చర్యలు తీసుకొని మెమోలు జారీ చేస్తామని తెలిపారు.కౌడిపల్లి మండలంలో ఉపాధి హామీలో భాగంగా 275 పనులు జరిగాయి. వీటికి రూ. 5,79,35, 596లు ఖర్చు కాగా పంచాయతీరాజ్‌లో జరిగిన 52 పనులకు రూ.2,68,47,582లు ఖర్చు కాగా, అటవీ శాఖలో నాలుగు పనులకు రూ. 5,31,038 లు ఖర్చు కాగా మొత్తం రూ. 8,53,14,216ల నిధులు ఖర్చు అయ్యాయని తెలిపారు. సామాజిక తనిఖీ అంటే ఉపాధి హామీ పనులు మండలంలో సక్రమంగా జరుగుతున్నాయా లేదా కూలీలకు చెల్లింపులు సరిగా జరుగుతున్నాయా, అధికారుల తప్పిదాలు ఏమైనా ఉన్నాయా అనే వాటిపై ప్రతి సంవత్సరం సామాజిక తనిఖీ జరుపుతామన్నారు. విజిలెన్స్ అధికారి శ్రీహరి, స్టేట్ మానిటరింగ్ అధికారి దత్తు, ప్రోగ్రాం మేనేజర్ అశోక్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ అరుణ, సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో పుణ్యాదాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గీతా స్కూల్ విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి

నవతెలంగాణ-తూప్రాన్



మహబూబ్ నగర్ జిల్లాలోని జడ్చర్లలో జరిగి న రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తూప్రాన్ గీతా స్కూల్ ఎని మిదవ తరగతి విద్యార్థిని ఆఫీఫా ఫాతిమా రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు గీతా స్కూల్ యాజమాన్యం శుక్రవారం తెలిపింది. రూపొందించిన చెట్లు, భవనాల ఎత్తును సమాంతర త్రిభుజ నియమాల సహాయంతో కొలవడం అనే ప్రాజెక్ట్‌ను తయారు చేసినందుకు గణిత నమూనా విభాగంలో రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి లభించింది. జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ ఏరియాలోని ఎస్వీకేఎం పాఠశాలలో విద్యార్థిని ఆఫీఫా ఫాతిమాకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బహుమతిని అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆఫీఫా ఫాతిమాను పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి. రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, ప్రిన్సిపాల్ సి.హెచ్. వెంకట కృష్ణారావు, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, సల్మా, ఉపాధ్యాయులు గైడ్ టీచర్ శ్రవణ్ కుమార్‌ను అభినందించారు.

మొక్కను సంరక్షించాలి

నవతెలంగాణ-నిజాంపేట



రాష్ట్ర ప్రభుత్వము హరితహారం మొక్కలను సంరక్షించాలని గ్రామపంచాయతీలకు అధికారులు పలు సూచనలు చేశారు. మొక్కలు మానవ జీవితానికి మనుగడని చెట్లను కాపాడు కున్నట్లయితే సకల కోటి జీవరాసులకు ఎంతో ఉపయోగపడుతయని పలువురు పేర్కొంటున్నారు. అందులో భాగంగానే మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామంలోని డి ధర్మారం రోడ్డులో గల హరితహారం మొక్కలకు గ్రామ వాచర్లు ప్రతినిత్యం నీళ్ల పోస్తు సంరక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ సుంచు బాబు, కమల, కనకవ్వ, లు తదితరులు పాల్గొన్నారు.

గీతా స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ పట్టణంలోని గీతా హైస్కూల్లో విద్యార్థిని, విద్యార్థులు శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తూ సందడి చేశారు. పల్లె వాతావరణం ఉట్టిపడేలా పూరిగుడిసెల్లో నివాసం హరిదాసులు, భోగిమంటలు, పాలపొంగులు, ముత్యాల ముగ్గులతో అలరారంగా గీతా స్కూల్ ప్రాంగణం సంక్రాంతి శోభతో కనువిందు చేసింది. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జోడెద్దుల సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను ప్రిన్సిపల్ వెంకటకృష్ణ రావు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు సకల సౌభాగ్యాలు కలుగజేసే రైతన్నను మరిచిపోవద్దన్నారు. అనంతరం పాఠశాల చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు బి. రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, ప్రిన్సిపల్ సి. హెచ్. వెంకటకృష్ణ రావు, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయ బృందానికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

పాఠశాల విద్యార్థులకు టైబెల్టుల అందజేత

నవతెలంగాణ-శివ్వంపేట



తాను పుట్టిన ఊరికి, చిన్నతనంలో చదువుకున్న పాఠశాలకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం గ్రామానికి చెందిన దాత బుర్ర మురళీ గౌడ్ పిల్లుట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు టై బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా మురళి గౌడ్ మాట్లాడుతూ తన సంపాదనలో కొంత ప్రభుత్వ పాఠశాలకు ఖర్చు చేయాలనే ఉద్దేశంతోనే విద్యార్థులకు చిన్నపాటి సహకారం అందించానని, భవిష్యత్‌లో మరింతగా తోడ్పాటు అందజేస్తానన్నారు. హెచ్ఎం యాదగిరి మాట్లాడుతూ మురళీ గౌడ్ వయసు చిన్నదైన గాని పెద్ద మనసుతో పాఠశాల విద్యార్థులకు సహాయం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం దాత మురళీ గౌడ్‌ను పాఠశాల తరుపున శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ పిల్లి మధు, ఆలయకమిటీ చైర్మన్ రాఘవరెడ్డి, బెస్త కిష్టయ్య, పెద్దపులి సతీష్, దినేష్ రెడ్డి, బొమ్మిరాల శంకర్, మస్కురి కన్నయ్య, బాసంపల్లి నర్సిములు, కమ్మరి వినయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్‌కు విరాళం

నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన అరగొండ నారాయణ, కిష్టమ్మ దంపతుల కుమారుడు అభిలాష్, స్వంతంగా రూ.10 వేల విరాళాన్ని శ్రీగురుపీఠం ట్రస్ట్‌కు శుక్రవారం అందజేశారు. జిల్లాలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లబోతున్న మండలంలోని గూడూరు గ్రామంలో గుంటూరు శ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ ఆశీస్సులతో హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీగురుపీఠం నిర్మాణానికి తన వంతు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడ ఆధ్యాత్మికతను కలిగి ఉండాలని, దైవచింతన కలిగిన ప్రవళిక సోదరుడు అభిలాష్ శ్రీగురుపీఠం నిర్మాణానికి సహకారం అందించినందుకు భగవంతుడు అరగొండ అభిలాష్ కుటుంబానికి ప్రతి నిత్యం ప్రశాంతమయ జీవితం అందించాలని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరుకుంటున్నారు.

ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి వేడుకలను ప్రధానోపాధ్యాయురాలు అరుణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థుల చేత వేషధారణలు వేయించి బాలికల చేత ముగ్గులు వేయించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ వర్షాకాలంలో పండిన పంటలను ఇంటికి తీసుకువచ్చి పిండి వంటలతో ఆనందంగా నిర్వహించారు. సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వినయ్, శ్రీలత, ఇంతియాజ్ భాను, ప్రమీల, బాల్ లక్ష్మి, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విష్ణు ఉన్నత పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ పట్టణ సమీపంలోని విష్ణు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా గౌరీ మాత పూజ చేసి, భోగి మంటలు వెలిగించి సంబరాలు జరిపారు. విద్యార్థులు వివిధ రకాల రంగులతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంక్రాంతి పండగ ప్రాముఖ్యతపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఉపాధ్యాయులను విద్యార్థులను యాజమాన్యం అభినందించారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్లు, పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-తూప్రాన్

మండలంలోని వట్టూర్ గ్రామంలో వ్యవసాయ పొలంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు వేలాడుతు న్నాయి. మండల విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొన్నదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మండ లంలోని విద్యుత్ అధికారులు పట్టించుకోని రైతుల పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలని రైతు ఆకుల శివకుమార్,గ్రామ రైతులు కోరుతున్నారు.

పది ప్రత్యేక తరగతులలో అలసత్వం వహించొద్దు

- డీఈఓ డాక్టర్ రాధాకిషన్

నవతెలంగాణ- శివ్వంపేట

త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్ష ఫలితాలలో జిల్లాలోని విద్యార్థులందరు ఉత్తమ ప్రతిభ కనబరచాలని, పది ప్రత్యేక తరగతుల నిర్వహణలో ఉపాధ్యాయులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ హెచ్చరించారు. మండలంలోని పాంబండ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాల పదో తరగతి విద్యార్థులతో గణితం, భౌతికశాస్త్రంలోని లెక్కలను బోర్డుపై చేయించి ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా డిఈఓ మాట్లాడుతూ ఈవిద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులందరు 10 జీపీఏ సాధించాలని, రాబోయే రెండు నెలల కాలంలో ప్రత్యేక తరగతులపై మరింత శ్రద్ధ చూపించి, విషయాలను పునఃచరణ చేసుకొని, కష్టపడి చదివి, ఫలితాలలో జిల్లా టాపర్లుగా నిలవాలని ఆయన సూచించారు. సబ్జెక్ట్‌లలో ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే పాఠశాల ఉపాధ్యాయులతో వాటిని నివృత్తి చేసుకుని, విషయ సంగ్రహణపై మరింత ప్రయత్నిస్తే పదిలో తప్పకుండ ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆయన సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాలలో నిర్వహించిన ముదస్తు సంక్రాతి సంబరాలలో ఆయన పాల్గొని విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించి, సంప్రదాయాలను ప్రోత్సాహిస్తున్న అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బుచ్చనాయక్, హెచ్ఎం మోహనరావు, ఉపాధ్యాయులు శ్రీసదన్ కుమార్, శ్రీధర్ రావు, వేణుగోపాల్ రెడ్డి, చెన్నానాయక్, జగదీశ్, శ్రీవాణి, పాల్గొన్నారు.



డాక్టర్‌గా మారిన అటెండర్

- శివ్వంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మరి ఘోరం సమయానికి రాకుండా సమయం కాకుండానే వెళ్లిపోతున్న సిబ్బంది.
- సిబ్బంది ఇష్టారాజ్యం, పట్టించుకోని జిల్లా వైద్యధికారులు.



నవతెలంగాణ-శివ్వంపేట

ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసి వైద్యులను, సిబ్బంది నియమిస్తే వారు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరుకు నిలువెత్తు నిదర్శనం శివ్వంపేట ప్రభుత్వ ఆసుపత్రి. శుక్రవారం గాయాలతో పాఠశాల విద్యార్థులు ఆసుపత్రికి రాగా సమయం కాకుండానే ఆసుపత్రి నుంచి డ్యూటీ సిబ్బంది అంతా వెళ్లిపోవడంతో అటెండర్ సతీష్ కాసేపు వైద్యుని అవతారమెత్తి అన్ని తానై కట్టు కట్టి పంపించాడు. సమయం మధ్యాహ్నం మూడు గంటలు కాకముందే ఆర్థోపెటిక్ డాక్టర్ పవన్‌తో పాటు మిగతా సిబ్బంది కూడ విధుల నుంచి ఇంటికెళ్లిపోయారు. ఆసుపత్రి విధులకు హాజరయ్యేటప్పుడు సమయానికి రారు, ఇంటికి పోయేటప్పుడు మాత్రం సిబ్బంది ఇష్టమే. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే శివ్వంపేట ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని రోగులు మండిపడుతున్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు







నవతెలంగాణ-మనోహరాబాద్

మనోహరాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మందస్తు సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మనోహరబాడ్ నందు ముందస్తు సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులు ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జరీనా సుల్తానా, ఉపాధ్యాయులు శ్రీదేవి, సుషణీత, భాగ్యలక్ష్మి, మంజుల, లలిత విద్యార్థినులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలంలోని వెంకటాయపల్లిలో హైస్కూ ల్‌లో ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ పి.శారద ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలిచిన విద్యార్థినిలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జీ.సిది రాములు, శివకుమార్, పద్మ, వసుధ, రవీందర్, రతన్, జ్యోతి, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పుట్టకోట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పట్వారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినిలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం చాలా అద్భుతంగా, చక్కగా ముగ్గులు వేసిన పలువురు విద్యార్థినిలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతులు భవ్యశ్రీ, శ్రీవర్ష మైథిలి, మనస్విని, ద్వితీయ బహుమతులు హిమవర్షిని, సాయి సుష్మిత, భవాని, నైనికా విద్యార్థినిలు బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్ రెడ్డి, అమరవాణి, జ్యోతి, రజిత, దుర్గ, వనిత, పద్మ, తిరుమల, అరుణ, సుశ్రత్, విద్యార్థినీ, విద్యార్థులు, పాల్గొన్నారు.

సంఘటితంతోనే ముదిరాజుల సమస్యల పరిష్కారం

- ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు లక్ష్మీనర్సయ్య



నవతెలంగాణ-శివ్వంపేట

విబేధాలను పక్కనపెట్టి మనమంతా సంఘటితమైతేనే ముదిరాజుల సమస్యలన్ని పరిష్కారమవుతాయని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, సలహాదారులు పోల్దాస్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాయిపల్లిలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నుకున్న సందర్భంగా గ్రామంలో గ్రామకమిటీ అధ్యక్షులు దాసరి నాగరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జెండావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ జనాభాలో ముదిరాజులు సంఖ్యాపరంగా ఎక్కువే గాని వెనకబాటులో మాత్రం అన్నిటిలో ముందేనన్నారు. కులం జెండా కిందికి వచ్చే సరికి మనమంతా ఒక్కటేనని భావిస్తేనే బీసీడీ నుంచి బీసీఏ లోకి మారతామని ఆయన సూచించారు. లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ ముదిరాజులలో పార్టీలు వేరైనా గాని లక్ష్యం మాత్రం బీసీఏనని ఆయన స్పష్టం చేశారు. ముదిరాజ్ మహిళా సంఘం సభ్యురాలు సావిత్రి మాట్లాడుతూ వెనకబాటుతనం పోవాలంటే బీసీఏ సాధనకు కలసికట్టుగా పోరాడుదామని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామకమిటీ ఉపాధ్యక్షులు సంజీవ, సురేష్, యాదగిరి, సత్యనారాయణ, రమాకాంత్, తలారి నర్సిములు, బొట్టు మల్లేశ, చిన్నదాసరి అశోక్, రమేష్, పాల్గొన్నారు.

నిజాంపేటలో రోడ్డు భద్రత మాసోత్సవం

నవతెలంగాణ-నిజాంపేట



రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా నిజాంపేట్ గ్రామ ప్రజలకు రోడ్డు నియమ నిబంధనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు అందరూ రోడ్డు పై వాహనాలు నడుపుతున్నప్పుడు నియమ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల భారిన పడకుండా ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. మద్యం సేవించి మత్తు పదార్థాలను తీసుకొని వాహనాలను నడపద్దన్నారు. ప్రమాదాల బారిన పడితే కుటుంబాలు రోడ్డున పడతారన్నారు. కానిస్టేబుల్స్ విజయ్, సాయిబాబా పాల్గొన్నారు.

ఘనంగా మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట

మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ గుడి వద్ద కేకు కట్ చేసి ఘనంగా నిర్వమించారు. అనంతరం ముక్కోటి ఏకాదశి సందర్భంగా చల్మెడ శివారులోని తిరుమల స్వామి ఆలయంలో కేకు కట్ చేసి ఆలయ పూజారితో పూజలు చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ హనుమంతరావు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రామ్ రెడ్డి, ముత్యం రెడ్డి, నరసింహారెడ్డి, అబ్బా రెడ్డి, ముత్యాల మధుసూదన్ రెడ్డి, పంజా మహేందర్, వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, ఎండి నజీరుద్దీన్, లింగం గౌడ్, ఆకుల బాలయ్య, తుమ్మల రమేష్, అజయ్, బాదే రమేష్ , కాకి రాజయ్య, రమావత్ రాజు, సూరా రాములు, మడవత్ రాజు, లచ్చిరెడ్డి, తాజా మాజీ చల్మెడ ఉపసర్పంచ్ రమేష్, రమావత్ వినోద్, రమావత్ శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, భాస్కర్ గౌడ్, బొమ్మెన మల్లేశం, సామల రమేష్, భూమా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చిన్న శంకంపేట

మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో సంబరాలు జరిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాన సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. పేద ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సత్యనారాయణ, స్థానిక మాజీ తాజా సర్పంచ్ రాజిరెడ్డి, గోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ హన్మంతరావు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతున్ని వేడుకుంటున్నట్లు తెలిపారు. మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగా నరేందర్, జీవన్, సాయిలు, సుధాకర్, శివకుమార్, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలోని ఎస్బీఐ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంచనూరి రాజేష్, జప్తి శివునూరులో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చాంద్ పాషా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని, రాజకీయ పరంగా మరెన్నో పెద్ద పెద్ద పదవులను అలంకరించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గోవర్ధన్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మెన్ యెన్నం రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ఎమ్.ఎస్.ఎస్.ఓ నాయకుడు చందూ యాదవ్, మండల యూత్ అధ్యక్షుడు బాచి స్వామి, మండల మైనారిటీ నాయకుడు రఫీఖ్, ఎస్టీ సెల్ శంకర్ నాయక్, జహీర్, రాములు నాయక్, రుక్ముద్దీన్, ప్రభాకర్, రాయుడు, సంతోష్, బాలు నాయక్, స్వామి, యెమికె రాజు, మహేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పాపన్నపేట

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఏడుపాయల దేవస్థానం వద్ద పాపన్నపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రాజగోపురం ముందు కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్ మాట్లాడుతూ వన దుర్గ మాత ఆశీస్సులతో మైనంపల్లి హనుమంతరావు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని మెదక్ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంతప్ప, సతీష్, రమేష్ గౌడ్, మల్లప్ప వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్ రాథోడ్ భరత్ గౌడ్ విటల్ లక్ష్మణ్ చోటు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశితో ఆలయాల్లో భక్తుల సందడి









నవతెలంగాణ-మనోహరాబాద్

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మనోహరాబాద్ మండలంలోని ఉత్తర ద్వారా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని కూచారం శ్రీ కోదండ రామాలయంలో ఉదయం 3 గంటల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు పూజా కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజారి దైవజ్ఞ కొదుమగుల్ల వేణుగోపాల చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-నిజాంపేట

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని చల్మేడా గ్రామ తిరుమల స్వామి, కల్వకుంట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు నిజాంపేట, కోనాపూర్, రాయిలాపూర్, ఇస్సన్నపల్లి నందగోకుల్, నస్కల్, రాంపూర్, గ్రామాల నుండి కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి నాడు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లయితే పాపాలు తొలగి పుణ్యం లభించునని భక్తుల ప్రగాఢ విశ్వాసం కోరిన కోర్కెలు తీరునని విశ్వాసం. ఏ ఎస్ ఐ జైపాల్ రెడ్డి, ఆలయ చైర్మన్ రామ్ రెడ్డి, ముత్యం రెడ్డి నరసింహారెడ్డి, తుమ్మల రమేష్, బాదే రమేష్, కాకి రాజయ్య, గుడ్ల శ్రీకాంత్, కే తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని అతి ప్రాచీనమైన, మహిమాన్వితుడైన శ్రీ కప్పల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూప్రాన్ పట్టణ ప్రజలు భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించి,తమ కోరికలు నెరవేరాలని కోరుకున్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, ఆరోగ్యంగా జీవించాలని జ్యోతి కృష్ణ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నలింగ్ మల్లికార్జున గౌడ్, గోలి వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-పాపన్నపేట

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మండలములోని వెంకటేశ్వర స్వామి, రామాలయాల్లో దర్శనాల కోసం భక్తులు బారులు తీరారు. ఆలయంలో సుప్రభాత సేవతో స్వామి వారిని మేలుకొలుపు పంచామృతములతో అభిషేకించి పూలమాలలతో అలంకార చేసినట్లు తెలియజేశారు. వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకో వడం ఎంతో పుణ్యఫలం అని భక్తుల నమ్మకం. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు దేవాలయం పక్షాన ప్రసాదం, స్వామివారి పాదాల కాడ ఉంచిన పెన్ను పుస్తకాలు దేవాలయా నికి వచ్చిన పిల్లలకు అందజేసినట్టు తెలిపారు. మల్లంపేట రామాలయంలో రంగంపేట పీఠాధిపతి మాదానంద సరస్వతి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శనాలు కల్పించారు. మాజీ ఎంపీపీ చందన ప్రశాంత్ రెడ్డి, మాజీ ఏడుపాయల చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, పూజారులు ప్రభు లింగం, అనంత స్వామి, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి



- గజ్వేల్ జిల్లా ఆసుపత్రి ఇన్చార్జి డాక్టర్ అన్నపూర్ణ

నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ గజ్వేల్ జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు ఉన్నాయని, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ఆసుపత్రి ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ వైద్యులు ప్రజలకు అందుబాటులో సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వారి బంధువులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు సైతం అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఆపరేషన్, నార్మల్ డెలివర్ చేస్తున్నామని ఆమె అన్నారు. నంగునూరు, చేర్యాల, హుస్నాబాద్ ప్రాంతంలో కొంత తక్కువ ఉన్నప్పటికీ మెరుగైన వైద్యం అందిస్తున్నాం అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు కంటి వైద్యం, ఎముకల ఆపరేషన్,చిన్న పిల్లల వైద్య సేవలు, ప్రతి శుక్రవారం స్త్రీ నిపుణుల వైద్యం ప్రత్యేక వైద్య సేవలు (ఎన్ సి డి క్లినిక్) నిర్వహించబడునని తెలిపారు. వైద్య సిబ్బందితో తరచుగా సమావేశాలు నిర్వహించుకుని వైద్య సేవలను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని ఆమె చెప్పారు. లోటుపాట్లు ఏమన్నా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకపోయి పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. వీరితోపాటు డాక్టర్. సాయి కిరణ్, డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నంగునూరు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జి.సరిత పేర్కొన్నారు. నంగునూరు తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం మండల వ్యాప్తంగా 38 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 1,00,116 లు చొప్పున సుమారు రూ. 38,04,408 లు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు తీసుకున్నవారు వెంటనే తమ బ్యాంకు ఖాతాలో జమచేసుకోవాలని సూచించారు.మండలంలో ఇంకా ఎవరైనా చెక్కులు రానివారు ఉన్నట్లయితే ఎలాంటి అనుమానాలు, అపోహలు పెట్టుకోనవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ విడతల వారిగా కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, గిర్దావర్‌లు లింగం, జయసూర్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-కొండపాక

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రాజీవ్ రహదారి దుద్దెడ గ్రామ శివారులోని కలెక్టరేట్ కార్యాలయం ముందు చోటుచేసుకుంది. త్రీ టౌన్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామంకీ చెందిన ఎర్రవెల్లి బాలకిష్టయ్య, (59) తన భార్య రేణుకతో కలిసి వారి స్వంత పని నిమిత్తం ఇద్దరు కలిసి హెూండా యాక్టివా మోటార్ సైకిల్ పై స్వగ్రామం నుండి సిద్దిపేట కలెక్టరేట్‌కు వస్తుండగా ఉదయం కలెక్టరేట్ ముందర వెనుకల నుండి అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చిన లారీ ఢీ కొట్టడంతో మృతినిపై నుండి లారీ ఎక్కించగా బలమైన గాయలు అయి అక్కడిక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రేణుకకు స్వల్ప గాయలు అయ్యాయి. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

జూనియర్ కళాశాలను అధికారులు ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ములుగు



ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఉదయం స్పెషల్ ఆఫీసర్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖాధికారి కిషన్, సిద్ధిపేట జిల్లా విద్యాశాఖాధికారి రవిందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులు మంచి భవిష్యత్తు కోసం కష్టపడి చదవాలని, వార్షిక పరీక్షల కోసం సిద్ధం కావాలని సూచించారు. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శశికళ,అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పండగకి ఊరెళ్తే తస్మాత్ జాగ్రత్త



- గౌరారం ఎస్సై కారుణకర్ రెడ్డి

నవతెలంగాణ-వర్గల్

పండగ సెలవుల్లో ఊరెళితే జాగ్రత్తగా ఉండాలని గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలవుల్లో ఊరు వెళ్తున్నప్పుడు జాగ్రత్త వహించాలని, బంగారు ఆభరణాలు ఉన్నట్లయితే బ్యాంకులో పెట్టుకోవాలి అని సూచించారు. ఎవరైనా ఊరు వెళ్తున్నట్లయితే ఇంటికి తాళం వేసి ముందస్తుగా పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించినట్లయితే వారి ఇంటి పైన నిఘా ఉంటుందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు 100 నెంబర్‌కి డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. నమ్మకస్తులను మాత్రమే సెక్యూరిటీ కార్డుగా నియమించుకోవాలని అన్నారు. స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వలన రక్షణ ఉంటుందని తెలిపారు.

ఉత్తీర్ణశాతం పెంచాలి



నవతెలంగాణ-గజ్వేల్

మార్చిలో ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో ఉత్తీర్ణతా శాతంను పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్ బోర్డు పర్యవేక్షకులు కిషన్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశం జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డితో కలిసి కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే విద్యాసంవత్సరం లో అడ్మిషన్ల సంఖ్యను పెంచడం కోసం కృషి చేయాలని సూచించారు. డీఐఈఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు శక్తివంచన లేకుండా కృషి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసి, జిల్లా ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, అధ్యాపకులు వెంకటరమణ, ప్రకాష్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-దుబ్బాక

అనారోగ్యంతో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట 11వ వార్డుకు చెందిన చేనేత కార్మికుడు బొద్దుల భగవాన్ దాస్‌కు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.33 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆ వార్డు కౌన్సిలర్ నందాల శ్రీజ శ్రీకాంత్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన బండారి రాజయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.12వేల సీఎం సహాయనిధి చెక్కును శుక్రవారం బాధితునికి తాజా మాజీ సర్పంచ్ దినేష్ తివారి అందజేశారు. సీఎం సహాయనిధి కోసం కృషి చేసిన జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఈ సందర్భంగా బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు శవల్ల కిష్టయ్య పాల్గొన్నారు.

జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన చెప్యాల వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని చెప్యాల వెంకట్ రెడ్డి సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో బీజేపీని బలోపేతం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి నేతలు అందరితో కలిసి, సమన్వయంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, ఎంపీ రఘునందన్ రావు, జిల్లా బీజేపీ అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కుడిక్యాల రాములు, గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ నియోజకవర్గ సీనియర్ నాయకుల అందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎంపీటీసీని పరామర్శించిన మాజీ మంత్రి



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం అక్కెన పల్లి - సిద్ధన్న పేట మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతికి హైదరాబాద్ లోని రెనోవో హస్పిటల్ గుండె శస్త్ర చికిత్స జరుగుతు న్న విషయాన్నీ మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తెలుసుకొని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. తన ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

భావి భారత పౌరులుగా విద్యార్థులు ఎదగాలి.



నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని భావి భారత పౌరులుగా ఎదగాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నమూనా పంచాయితీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమూనా గ్రామ పంచాయతీ ఎన్నికలు, గ్రామ సభను చక్కగా నిర్వహించడం జరిగింది. విద్యార్థుల ప్రదర్శనను పరిశీలించి విద్యార్థులు అవినీతి లేని భారతాన్ని నిర్మించాలని మంచి ఉద్యోగాల్లో రాజకీయ రంగాల్లో రాణించాలని తెలియజేశారు.ఈ నమూనా పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ కె. జస్వంత్, ఉప సర్పంచ్ కె. నిఖిలేష్, గ్రామ కార్యదర్శి జే.వైష్ణవి, వార్డు సభ్యులు ఎం. రఘు,వై. గోవర్ధన్, జి.సౌమ్య,కే. జస్వంత్,ఎం. జయరాజు, ఎం.రేణుక, కే.ధనుష్, కే.ధ్రువక్షిత్, కే.జస్వంత్,"కే.నిఖిలేష్ ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యానారాయణ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఫిక్సుడ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

ఆశా వర్కర్లకు ఫిక్సుడ్ వేతనం రూ18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర పిలుపులో భాగంగా సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ కడవెర్గు మంజులకి, ఎమ్మెల్యే హరీశ్ రావు పీఏ ప్రవీణ్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్ల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు ఆశా వర్కర్లు రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేశారు. సమ్మె సందర్భంగా 2023న అక్టోబర్ 9 హైదరాబాద్, కోఠి కమీషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశా వర్కర్లతో ధర్నా నిర్వహించాం. ధర్నా సందర్భంగా ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారు. కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. డైరెక్టర్ హామీ ప్రకారం అక్టోబర్ 9న ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెను విరమించారు. వీటితో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చింది. 2024 ఫిబ్రవరి 9న, జూలై 30న, డిశెంబర్ 10న ఆరోగ్య శాఖ కమీషనర్ ఆఫీస్ ముందు ఆశాల ధర్నా, చర్చల సందర్భంగా కమీషనర్ స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని, మట్టి ఖర్చులు రూ. 50 వేలు ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు ఇస్తామని, టార్గెట్స్ రద్దు చేస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. ఇతర సమస్యల పైన ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేశారు.పై హామీల్లో ప్రింటెడ్ రిజిష్టర్స్ ఇచ్చారు. స్పూటం డబ్బాలు మోయటం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర సమస్యలు నేటికీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయలేదు. ఈ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగ్య కవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.



గురుకులాల్లో చేరి విద్యావంతులై విజేతలుగా నిలవాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి





నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో చేరి విద్యావంతులై విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాసంస్థలలో 5వ తరగతి ప్రవేశాలు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9 తరగతులలో ఖాళీల ప్రవేశాలకు, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) గౌలిదొడ్డి, అలుగునూరు సి ఓఈ లలో 9వ తరగతి ప్రవేశాలు, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈల్లో 8వ తరగతి ప్రవేశాలు, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్ఐ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను కామన్ ప్రవేశ పరీక్షకు (ఇంగ్లీషు మీడియం) జిల్లా నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం దరఖాస్తులను సంబధిత వెబ్సైట్ ద్వారా ఆన్లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. అలాగే దరఖాస్తులకు చివరి తేదీ వచ్చే నెల ఫిబ్రవరి 1 అని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదిన ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు కావలసినవి. 1. కులం సర్టిఫికేట్ నెంబరు 2. ఆదాయం సర్టిఫికెట్ నెంబరు 3. ఆధార్ కార్డు నెంబర్ 4. బర్త్ సర్టిఫికేట్ 5. ఫొటోలు సర్టిఫికెట్ల సత్వర జారి కోసం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

వ్యవసాయ కూలీలకు రూ.12వేలు అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య

నవతెలంగాణ-కొండపాక

భూమి లేని వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇస్తామన్న ప్రభుత్వ హామీని వెంటనే అమలు చెయ్యాలని, సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటి సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. శుక్రవారం ఆ పార్టీ తిప్పారం గ్రామ శాఖ సమావేశం సాయికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బాల్ నర్సయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని పేదలకు రూ, 12వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, తీరా అమలు చేయడానికి ఉపాధిహామీ పనిదినాలు కొలమానంగా తీసుకోవడం సరికాదన్నారు. ఉపాధిహామీలో కనీస వేతనం లేక, సకాలంలో డబ్బులు రాక, పనులు కల్పించక పోవడం, పని ప్రదేశాలలో సౌకర్యాలు లేని కారణంగా, భూమిలేని పేదలు ఇతర పనులకు వెళ్తున్నారని అన్నారు. ఉపాధిహామికి సంబంధం లేకుండా వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలని, లబ్దిదారులను గ్రామ సభల్లో ఎంపిక చెయ్యాలని కోరారు. కుంటి సాకులతో లబ్ధిదారులను కుదించే చర్యలు చేపట్టవద్దని అన్నారు. మున్సిపాల్టీలలో చేర్చిన గ్రామాలు, పట్టణాలలో, పనులు లేక ప్రజలు ఉపాధి కోల్పోయారని, వారిని కూడ వ్యవసాయ కూలీలుగా గుర్తించి అర్హులైన వారందరికి న్యాయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బి.కొమురయ్య, ప్రభాకర్, కనకయ్య, శాఖ కార్యదర్శి నరహరి, సభ్యులు అమృత్, బాగ్యవ్వ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-మర్కుక్



ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక సీసీ కెమరా 100 మందితో సమానమని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో దాత మాజీ పాములపర్తి తిర్మల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమరాల మర్కుక్ ఎస్ఐతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల రక్షణ సెన్సాఫ్ సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని 24 గంటలు పనిచేస్తాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు , వ్యాపారస్తులు ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. గ్రామ ప్రధాన కూడలిలో, ఎగ్జిట్ ఎంట్రీ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమన్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల పనిచేయడం లేదని, గ్రామంలో ఉన్న యువకులు ఏం చేస్తున్నారు అనేది తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, నాయకులు కాంత్రి,మహేష్ గౌడ్, గ్రామస్థులు తదితరులున్నారు.

పేదల ప్లాట్లని స్థలాన్ని ఇతర పథకాలకివ్వొద్దు

నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండల కేంద్రంలో బీపీఎల్ కుటుంబాలకు కేటాయించిన ప్లాట్లను ఇతర పథకాలకు కేటాయించవద్దని మద్దూరు తహసిల్దార్ ఏజే రహీంకు శుక్రవారం గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1998 ఏడాదిలో సర్వేనెంబర్ 175,152లో బీపీఎల్ కుటుంబాల కోసం అప్పటి మాజీ మంత్రి మాజీ ఎమ్మెల్యే నిమ్మ రాజిరెడ్డి, సహకారంతో గ్రామంలోని 125 కుటుంబాలకు. ప్రతి కుటుంబానికి 5 గుంటల చొప్పున పట్టాలు అందించారని వారు తెలిపారు. అక్కడ నీటి, కరెంటు, సౌకర్యం లేకపోవడంతో పేద ప్రజలం ఇండ్లు కట్టుకోలేదని వారు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తే వెంటనే నిర్మించుకుంటామని వారు తెలిపారు. ఇట్టి ప్లాట్లను ప్రభుత్వం వేరే పథకాలకు కేటాయించవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మాజీ ఎంపీటీసీలు బూరుగు నరసింహులు, బొప్ప కనకమ్మ నాగయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దామెర మల్లేశం, మైనార్టీ నాయకులు షకీల్ అహ్మద్, ఫయాజ్, ముఖసిర్, జమీల్, సలీం, అబ్దుల్ ఖాదర్, గాజుల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు చెక్ డ్యాం పనులు ప్రారంభించుటకు అనుమతి

- పనులు వేంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- చెక్ డ్యామ్ పూర్తిచేసి రైతులకు నీరు అందించండి



నవతెలంగాణ-సిద్ధిపేట/సిద్ధిపేటరూరల్

సిద్దిపేట నియోజకవర్గంలోని నారాయణరావు పేట మండలం గోపులాపూర్ గ్రామం లో రూ. 1కోటి 34 లక్షలు, చిన్నకోడూర్ మండలం కస్తూరిపల్లిలో రూ.3కోట్ల 28 లక్షలు చెక్ డ్యామ్‌ల కోసం జీవో 20ని గత ప్రభుత్వంలో మంజూరు చేసుకున్నామని, టెండర్లు పూర్తి అయిన పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి టెండర్లు పూర్తి అయిన పనులు నిలిచి పోయాయని లేఖ వ్రాయడం జరిగిందని, ఈ మేరకు పనులు ప్రారంభించాలని అనుమతులు వచ్చా యని తెలిపారు. ఈ చెక్ డ్యామ్‌లు పూర్తి అయితే 200ఎకరాల ఆయకట్టు కస్తూరి పల్లి చెక్ డ్యామ్ ద్వారా, 100 ఎకరాల ఆయకట్టు గోపులా పూర్, మాటిండ్ల, శేఖర్ రావు పేట గ్రామాల్లో సాగుకు భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. టెండర్లు పూర్తి అయినవి కావున పనులు వేంటనే ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

అభాగ్యులను ఆదుకోవడమే ఎస్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం

- ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

అనాథలు, అభాగ్యులకు మానవత్వంతో ఆదుకోవడమే లక్ష్యంగా పని చేయడం జరుగుతుందని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామంలో తల్లి మరణించి తండ్రి మతిస్థిమితం కోల్పోయిన ముగ్గురు పిల్లలకు నిత్యావసర సరుకులు, బట్టలు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దర్శనం నాగమణి, నర్సింలు దంపతులకు రాజేందర్, హరికృష్ణ, చందు ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు. భార్య భర్తలు రోజు వారి కూలీ చేసుకుంటూ బ్రతుకుతుండేవారన్నారు. పది రోజుల క్రితం అనారోగ్యంతో నాగమణి అస్వస్థకు గురై ఆరు రోజుల క్రితం గాంధీ ఆసుపత్రిలో మరణించింది. నాగమణి భర్త నర్సింలు మతిస్థిమితం కోల్పోయి నాగమణి అంత్యక్రియలలో పాల్గొనకుండా ఎక్కడికో వెళ్లిపోవడం బాధాకరమన్నారు. ఈ ముగ్గురు అబ్బాయిలను ఆదుకోవడానికి మానవతవాదులు, ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు, కోశాధికారి మహమ్మద్ ఉమర్, జర్నలిస్ట్ మన్నె గణేష్, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రగతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- నిర్వాహకులను అభినందించిన అతిథులు



నవతెలంగాణ- గజ్వేల్

స్వామి వివేకానంద జయంతి ఈ నెల 12న జరగనున్న నేపథ్యంలో జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా ప్రగతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ సీఐ సైదా, గజ్వేల్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా ఎ. భవాని , ప్రత్యేక ప్రముఖ చర్మ వ్యాధి నిపుణులు డా ఎం. సునీత్ కుమార్ , ప్రగతి విద్యాసంస్థల చైర్మెన్ ఎం. అంబాదాస్ ,కళాశాల ప్రిన్సిపాల్ మట్టయ్య చౌదరి, ప్రగతి పూర్వ విద్యార్థి,సామాజిక వేత్త, ప్రభుత్వ ఉపాధ్యాయులు మల్లికార్జున్ ,కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో 31 మంది రక్త దాతల నుండి రక్తాన్ని సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలోగజ్వేల్ సిఐ, సైదా, డా భవాని, డా సునీత్ కుమార్‌లు ప్రసంగించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమ ఏర్పాటుకు సహకరించిన గజ్వేల్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా: భవాని ,గజ్వేల్ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ శివఇతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



పదో తరగతి విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

పదో తరగతి విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని, ఈ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం తప్పదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రయివేట్ విద్య సంస్థలు టెన్త్ క్లాస్ విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా దొంగతనంగా క్లాసులు నిర్వహిస్తే, స్కూల్ యాజమాన్యాల మీద పోరాటం తప్పదన్నారు. ఇప్పటికే ఆదివారాలు విద్యార్థులను స్పెషల్ క్లాసుల పేరిట మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. విద్యార్థుకు స్పెషల్ క్లాస్ పేరిట సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే, ఆ విద్యాసంస్థల ముందు ధర్నా నిర్వహిస్తామని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలనుకు తరగతులు నిర్వహించకుండా సూచన చేయాలని కోరారు.

స్వామి వివేకానంద బాటలో విద్యార్థులు నడవాలి

నవతెలంగాణ-సిద్ధిపేట

స్వామి వివేకానంద బాటలో విద్యార్థుల్లో నడవాలని ఎంఈఓ రాజ ప్రభాకర్ రెడ్డి అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఇంద్రానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య మాట్లాడుతూ విద్యార్థులందరూ మన సాంస్కృతిక, సాంప్రదాయాలను పాటిస్తూ, మహనీయుల ను మనము ఆదర్శంగా తీసుకుని, జాతీయ భావజాలను పునికి తెచ్చుకొని, దేశం కోసం, సమాజం కోసం మనందరం పనిచేయాలన్నారు. స్వామి వివేకానంద ఆశయాలను యువత మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో నగర కార్యదర్శి పరుశురాం, జోనల్ ఇంచార్జ్ అనీష్, నగర ఉపాధ్యక్షుడు లోకేష్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

- మాస్టర్ మైండ్ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, 2కే రాన్
- ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ఎస్సై అపూర్వ రెడ్డి



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్


విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సీఐ ప్రవీణ్ కుమార్‌తో కలిసి మాస్టర్ మైండ్ స్కూల్ స్టూడెంట్స్ తో కలిసి ముస్తాబాద్ చౌరస్తా నుంచి సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా వరకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలతో కూడిన ప్లే కార్డులతో స్లొగన్స్ ఇస్తూ ర్యాలీ నిర్వహించి, స్టూడెంట్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు తెలిసి ఉంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని తెలిపారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అధిక వేగంతో ప్రయాణించి ప్రమాదాలకు గురై కుటుంబాలను శోకసముద్రంలో ముంచవద్దని తెలిపారు. అనంతరం పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు 2కే రాన్ , ముగ్గుల పోటీలు కార్యక్రమం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ రాజు, ప్రిన్సిపాల్ మాళవిక, కరస్పాండెంట్ హరిపాల్, గడిల మహేశ్వర్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో అటో డ్రైవర్ ఆత్మహత్య



నవతెలంగాణ-నంగునూరు

అప్పుల బాధతో అటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నట్లు రాజగోపాల్ పేట ఎస్సై ఎం.డి.ఆసీఫ్ తెలిపారు. కుటుంబస్తులు, ఎస్సై కథనం ప్రకారం వివరాలిలా ఇలా..నంగునూరు గ్రామానికి చెందిన జంగిటి నర్సింహులు (36)ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. రెండేండ్ల క్రితం ఇల్లు కట్టడంతో దాదాపు రూ.5 లక్షలు వరకు అప్పు అయిందని పేర్కొన్నారు. ఆటో నడుపుతున్న ఆటో సరిగా నడవకపోవడంతో అప్పు గురించి బాధపడి మనస్థాపానికి గురైనాడు. తన ఇంట్లోనే హాల్లో సీలింగ్ కు చీరతో ఉరివేసుకొని చనిపోయినాడని చెప్పారు. మృతుని భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



నవతెలంగాణ-నంగునూరు

అప్పుల బాధతో మృతి చెందిన జంగిటి నర్సింహులు కుటుంబానికి బాలాజీ ఆటో యూనియన్ సంతాపం ప్రకటించారు. మృతుని కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అదే విధంగా నంగునూరు పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన జంగిటి నర్సింహులు కుటుంబానికి పురుషుల సంఘం అధ్యక్షుడు, సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అతని అంత్యక్రియలకు పురుషుల సంఘం నుండి రూ.3 వేలు అందజేశారు. అధ్యక్షులు రాజపేట గోపాల్, ఉపాధ్యక్షులు ఆరె శ్రీనివాస్ గౌడ్, పాలకవర్గం రాగుల మల్లేశం, భీం రెడ్డి లక్ష్మారెడ్డి, వల్లపు రెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఒడ్డె ఒబన్న జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి

- వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ షేక్ హమీద్

నవతెలంగాణ-సిద్ధిపేటకలెక్టరేట్ : వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, సిద్దిపేట వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 11న ఒడ్డె ఒబన్న జయంతి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం సిద్దిపేటలో ఉదయం 11:00 గంటలకు ఉంటుందని, జయంతి ఉత్సవాలు కావున జిల్లాలో గల ప్రజా ప్రతినిధుల, తదితరలు అందరు పాల్గొని విజవంతం చేయాలని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి షేక్ హమీద్ తెలపారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-సిద్దిపేట



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదేశాల మేరకు సిద్దిపేట విపంచి కలనిలయంలో సిద్దిపేట నియోజకవర్గ అర్బన్, రూరల్ మండలాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు తెలిపారు. ఆమె మాట్లాడుతూ అర్బన్ మండలం 71, రూరల్ మండలం 141చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, ఆర్డీవో, అర్బన్, రూరల్ ఎమ్మార్వోలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బెజ్జంకి



పుట్టగొడుగుల తయారీకి అంది స్తున్న ఉచిత శిక్షణను యువతి యువకులు సద్విని యోగం చేసుకోవా లని దేశ్ పాండే సంస్థ డైరెక్టర్ రాజలిం గం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చీలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాల యం వద్ద గ్రామంలోని యువతియువకులకు దేశ్ పాండే, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అధ్వర్యంలో పుట్టగొడుగుల తయారీపై అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధి ఎండీ.నజీమ్ అలీ, దేశ్ పాండే ప్రతినిధులు రేఖ, రమేష్,యువతీ యువకులు,రైతులు పాల్గొన్నారు.

రబీ సాగుకు నీటిని విడుదల చేయండి

-బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



రబీ సాగుకు నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ మండలం బురుగుపల్లి గ్రామం ఆయన ఇంటిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మల్లన్న సాగర్ కెనాల్ నుంచి హల్దీ వాగులోకి కొండపోచమ్మ సాగర్ కెనాల్ నుండి కుడవల్లి వాగులోకి, తుర్కపల్లి కెనాల్ లోకి వెంటనే గోదావరి జలాలను విడుదల చేసి, రైతుల పంటలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు నారుమల్లు పోసుకొని సాగునీరు కోసం ఎదురుచూస్తున్నారని, మరి ఇతర పంటల వేసుకుని సాగునీరు కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. రైతు పొలాలకు సాగర్లలో పుష్కలంగా నీళ్లు ఉన్న సాగునీలను అందించకపోవడం చాలా బాధాకరమన్నారు.

బీజేపీ గజ్వేల్ పట్టణ, మండల అధ్యక్షులు ఎన్నిక

నవతెలంగాణ-గజ్వేల్



సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులుగా దేవులపల్లి మనోహర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో బీజేపీని బలోపేతం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు , సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ సీనియర్ నాయకుల అందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

మండల అధ్యక్షుడుగా వెంకట్రామిరెడ్డి

నవతెలంగాణ-నంగునూరు



బీజేపీ నంగునూరు మండల అధ్యక్షుడుగా చౌడుచెర్ల వెంకట్రామిరెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను రెండో సారి ఎన్నుకున్నందుకు జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డికి, మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్తను కలుపుకొని కృషి చేస్తానని పేర్కొన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

-డిఐఈఓ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల



చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఐఈఓ రవీందర్ రెడ్డి అధ్యాపకులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం రాష్ట్ర అబ్జర్వర్ కిషన్ తో కలిసి డిఐఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. యాక్షన్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-సిద్దిపేట



దేశంలో క్రీడలను ప్రోత్సహిం చడమే ప్రధాని మోదీ ముఖ్య ఉద్దేశమ ని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పోషవేని సతీష్ కుమార్ తెలిపారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ మైభారత్ ఎన్ వై కే సిద్దిపేట జిల్లా వారి ఆధ్వర్యంలో చిన్నకోడూర్ బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు బాలురకు వాలీబాల్, బాలికలకు కబడ్డీ, రన్నింగ్, షటిల్ క్రీడలను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్స్, మెడల్స్, క్రీడా పరికరములు ఎన్ వై కే అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, వాలీబాల్ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ గుండీ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డె ఒబన్న జయంతిని విజయవంతం చేయాలి

-వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి షేక్ హమీద్

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, సిద్దిపేట వారి ఆద్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 11న ఒడ్డె ఒబన్న జయంతి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం సిద్దిపేటలో ఉదయం 11:00 గంటలకు ఉంటుందని, జయంతి ఉత్సవాలు కావున జిల్లాలో గల ప్రజా ప్రతినిధుల, తదితరలు అందరు పాల్గొని విజవంతం చేయాలని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి షేక్ హమీద్ తెలపారు.

ఘనంగా మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మైనంపల్లి హనుమంతరావు జన్మది నం సందర్భంగా కాంగ్రెస్ నియోజ కవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ కేక్ ను కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు సాకి ఆనంద్, రియాజ్, మహేందర్ ల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద మైనంపల్లి జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంప మహేందర్, పయ్యావుల ఎల్లం, గోపికృష్ణ, అంజయ్య, అంజిరెడ్డి. పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండల కేంద్రంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి కేక్ కట్ చేసి హనుమంతరావు కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తప్పెట శంకర్, నంగునూరు గ్రామ శాఖ అధ్యక్షుడు ఏబీ నాగరాజు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పలు గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత, కేసు నమోదు

నవతెలంగాణ-నంగునూరు



ప్రభుత్వం నిషేధించిన గుడుంబా (నాటుసారా)10 లీటర్లు, 10 ప్యాకెట్స్ స్వాధీనం చేసుకున్నట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. అక్కన్నపేట మండలం మల్ చెరువు తాండకు చెందిన గుగులోత్ శ్రీను తన మోటార్ సైకిల్ టీఎస్ 36ఎం-8298 గల దానిలో ప్రభుత్వం నిషేధించిన గుడుంబా, నాటు సారా తీసుకొని సిద్దిపేట వైపు వస్తున్నాడని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది నంగునూరు మండలం గట్ల మల్యాల గ్రామ శివారులో ఆపి తనిఖీ చేయగా 10 ప్యాకెట్ల నాటుసారా (గుడుంబా), 10 లీటర్లు స్వాధీనం చేసుకొన్నమన్నారు. నిందితుని వాహనాన్ని రాజగోపాలపేట పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. రాజగోపాలపేట పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు.

అట్టహాసంగా ముగిసిన క్రీడలు

నవతెలంగాణ-మెదక్ : మెదక్ జిల్లా కార్యాలయం వద్ద ఉన్నపోలీసు గ్రౌండ్‌లో మెదక్ జిల్లా క్రీడా పోటీలు ముగిశాయని జిల్లా ఎస్పి డి. ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో 3 డివిజన్ల జట్లు పాల్గొన్నాయని తెలిపారు. గెలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదేవిదంగా స్టేట్ లెవెల్ పోటీలో మంచి ప్రతిభ కనభరిచి జిల్లాకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డి.ఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్.ఎస్ఐలు జిల్లా పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనంగా రూ.18 వేలు ఇవ్వండి

- బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించేలా ఎమ్మెల్యే కృషి చేయా
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా కోశాధికారి జీ.భాస్కర్



నవతెలంగాణ-దుబ్బాక

ఆశాలకు కనీస వేతనంగా రూ.18 వేలు ఇవ్వాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటన చేయించేలా దుబ్బాక ఎమ్మెల్యే కృషి చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా కోశాధికారి జీ.భాస్కర్ కోరారు.ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత,ప్రమోషన్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం దుబ్బాకలోని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి క్యాంప్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పీఏ జనార్ధన్‌కు వినతిపత్రాన్ని అందజేసి వారు మాట్లాడారు. గతంలోనే హైదరాబాద్‌లోని హెల్త్ కమిషనర్ ఆఫీస్ ముందు వేలాదిమంది ఆశాలతో ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. అప్పటి హెల్త్ కమిషనర్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశాలకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, ప్రసూతి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు ఇస్తామని, టార్గెట్లను రద్దు చేస్తామని పలు నిర్దిష్టమైన హామీలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఏడాది గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఈ హామీలను అమలు చేయకపోగా ఆశాలతో సంబంధం లేని ఇతర పనులను చేయించడం బాధాకరమ న్నారు.ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనియెడల సీఐటీయూ ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆశా వర్కర్ల సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.ప్రవీణ, సీఐటీయూ దుబ్బాక మున్సిపల్ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, నియోజక వర్గంలోని పలు మండలాలకు చెందిన ఆశాలు చంద్రకళ, సంతోష, మాలతి, బాబాయి, కవిత, బాలమని, సుజాత, లక్ష్మి, భాగ్యమ్మ పలువురు పాల్గొన్నారు

వరి పంటలో కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వాడొద్దు

-దుబ్బాక ఏడిఏ మల్లయ్య

నవతెలంగాణ- దౌల్తాబాద్

వరి పంటలో కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా అందించకూడదని వ్యవసాయ సహాయ సంచాలకులు మలయ్య రైతులకు సూచించారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం గోవిందపూర్ గ్రామంలో వరి సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాస్వరం మొక్క వేరు వ్యవస్థ పెరుగుదలకు సహాయపడుతుందని, భాస్వరాన్ని చివరి దుక్కిలో లేదా నాటిన 5 రోజుల లోపు వేయాలని అన్నారు. కాంప్లెక్స్, ' డిఏపి ఎరువులకు నెమ్మదిగా కరిగే స్వభావం ఉంటుంది. కాబట్టి వీటిని పై పాటుగా అందించడం వలన కావలసిన సమయంలో పోషకాలు మొక్కలకు అందే అవకాశం ఉండదని తెలిపారు. దీనివల్ల పంటకు ఎటువంటి ప్రయోజనం ఉండదు పై గా భూమిలో భాస్వరం శాతం పెరగడం ద్వారా జింక్ పోషక లోపం ఏర్పడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంతోష్ కుమార్, రైతులు యాదవ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-దుబ్బాక



పశువుల్లో తలెత్తే గర్భకోశ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పశుగణాభివృద్ధి సంస్థ మెదక్ ఈవో డాక్టర్ రాంజీ తెలిపారు. అందులో భాగంగా దుబ్బాక మండలంలోని ఆకారంలో శుక్రవారం పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా 'ప్రత్యేక పశు వైద్య, గర్భకోశ వ్యాధుల నివారణ' శిబిరాన్ని నిర్వహించారన్నారు. పశువులకు గర్భధారణ చికిత్సలు, కృత్రిమ గర్భధారణ వల్ల కలిగే లాభాల పట్ల పాడి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని 50 ఆవులు, గేదెలకు గర్భకోశ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశామని, మరో 15 పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరం ద్వారా చిన్నకోడూరు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు శిక్షణ కల్పించారు. వారి వెంట దుబ్బాక మండల పశు వైద్యాధికారిని డాక్టర్ నిహారిక, గోపాలమిత్ర సూపర్వైజర్ సత్తార్, చిన్నకోడూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.పర్శరాములు, గోపాలమిత్రులు తదితరులు ఉన్నారు.

పంట పొలాలకు సాగు నీటిని విడుదల చేయండి

- రంగనాయక సాగర్ ఈఈకి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట

సంక్రాంతి పండుగలోపు రంగనాయక సాగర్ లోని నీటిని నారాయణరావుపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు విడుదల చేయాలనీ ఆయా గ్రామాల బిఆర్ఎస్ నాయకులు ఇరిగేషన్ అధికారులను కోరారు. శుక్రవారం రంగనాయక సాగర్ ఈఈ కి బిఆర్ఎస్ పార్టీ పక్షాన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు బాలకృష్ణ, ఎల్లారెడ్డి, ఆంజనేయులు, సంతోష్, హరీష్‌లు మాట్లాడుతూ గతంలో కూడా నీటిని విడుదల చేయాలని కోరితే, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వానికి లేఖలు రాస్తే, జనవరి చివరి వారంలో నీటిని విడుదల చేశారని, అప్పటికే పంటలకు జరిగే నష్టం జరిగిందని అన్నారు. ఈసారి పంటకు నష్టం జరగకుండా ఉండడానికి సంక్రాంతికి ముందే నీటిని విడుదల చేయాలని కోరారు.

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

నారాయణరావుపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని పంట పొలాలకు వెంటనే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ల ద్వారా సాగునీరును అందివ్వాలని కోరుతూ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కోనయ్య గారి ఎల్లయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది మాజీ మంత్రి హరీశ్ రావు పలుమార్లు ప్రభుత్వానికి ఉత్తరాలు వ్రాసిన సందర్భంగా, జనవరి చివరి వారంలో నీటిని విడుదల చేశారని, లేట్‌గా నీటిని విడుదల చేయడంతో, పంట పొలాలు ఎండిపోయాయని, ఈ ఏడాదైనా సంక్రాంతి లోపు నీటి విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్ కుమార్, మాజీ సర్పంచులు శాతారాజు పల్లి ఆంజనేయులు, రోమాల శంకర్, మాజీ ఎంపీటీసీ ఆకుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ చంద్రకరణను బడా కాంట్రాక్టర్ హత్య చేయించారు

నవతెలంగాణ-సిద్దిపేట



ఛత్తీస్‌గడ్ లో జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకరణను బడా కాంట్రాక్టర్ హత్య చేయించారని వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఛతీస్‌ఘడ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు సత్తయ్య మాట్లాడుతూ జర్నలిస్ట్ చంద్రకరన్ ఆదివాసుల హక్కుల గురించి బయట ప్రపంచానికి తెలియజెప్పే ప్రయత్నం చేస్తూ, కాంట్రాక్టర్ దోపిడిని అరికట్టడానికి, అవినీతిని వెలికి తీసినందుకు అతనిని చాలా క్రూరంగా చంపి, కిరాతకంగా గుండెను చీల్చి, సెప్టిక్ ట్యాంక్ లో పడేసిన సంఘటన అందరిని కలిసి వేస్తుందని అన్నారు. దీనికి బాధ్యులైన వారి అందర్నీ కఠినంగా, చట్టపరంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ , పీడీఎం. పీడీఎస్‌యూ. డీటీఎఫ్ ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఎంతో గొప్పది

- డీఈవో ఈ.శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ- తొగుట

విద్యార్థులకు మక్ పోలింగ్ ద్వారా రాజ్యాంగం, ఓటు యొక్క విలువ తెలిసిందని డీఈవో ఈ. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావు పేట జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో విద్యార్థులకు మాకు పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులకు రాజ్యాంగంపై ఉన్న నమ్మకం, కట్టుబాట్లు, నియమాల గురించి పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. ప్రభుత్వాలు ఏర్పడుతున్న ఓటుకు ప్రాముఖ్యత లేకుం డా పోయిందని మంచి నాయకున్ని ఎన్నుకొని రాజ్యాంగాన్ని రక్షించి రాబోవు తరాలకు విలువల తో కూడిన పరిపాలన కొనసాగించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఎంతో గొప్పదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వడ్లకొండ నరసయ్య, ప్రధానోపాధ్యాయురాలు నహిమ కైసర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పండగకు ఊరు వెళ్తే దొంగల పట్ల జాగ్రత్త వహించాలి

నవతెలంగాణ- రాయపోల్





సంక్రాంతి పండగకు ఊరికి వెళ్ళే ప్రజలకు దొంగతనాల నివారణ గురించి రాయపోల్ ఎస్సై రఘుపతి, దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ ముఖ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిలో విలువైన వస్తువులు, నగదు, బంగారం ఆభరణాలు పెట్టకండి వాటిని బ్యాంకులో దాచుకోవడం ఉత్తమం. వాహనాలను ఇంటి వద్దనే పార్క్ చేసి తాళం చెవులు వెంట తీసుకుని వెళ్లాలన్నారు. ఊరికి వెళ్ళేటప్పుడు మీకు నమ్మకమైన వారికి అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వలాన్నారు. మీ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది, భద్రత ఎక్కువగా ఉంటుందన్నా రు. ప్రజలు ఊరికి వెళ్ళే విషయా న్ని ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయవద్ద న్నారు. అపరిచిత వ్యక్తులు, ఎవరిమీదైనా అనుమానం వస్తే 100 టోల్ ఫ్రీ నెంబర్ కి గాని, రాయపోల్ పోలీస్ స్టేషన్ 87126 67346, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ 8712667344 కు డయల్ చెయ్యాలని ప్రజలందరూ ప్రశాంతయుత వాతావరణంలో సంక్రాంతి పండుగ నిర్వహించుకోవాలని సూచించారు.

విద్యార్థులు మంచి మార్గాన్ని ఎంచుకోవాలి

నవతెలంగాణ-మిరుదొడ్డి



విద్యార్థులు ఉన్నత చదువు చదివి మంచి మార్గాన్ని ఎంచుకోవాలని కొండాపూర్ గ్రామానికి చెందిన వేముల సుధీర్ అన్నారు. శుక్రవారం మీరు దొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నారు. చదువు ప్రతి ఒక్కరికి మంచి మార్గాన్ని చూపుతుందని తెలిపారు. చదువు వల్ల విద్యార్థులకు మంచి మార్గం చూపే దిశగా పనిచేస్తూనే ఉన్నారు. అనంతరం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న ఉపాధ్యాయులు లక్ష్మణ్ తో పాటు కొండాపూర్ పంచాయతీ కార్యదర్శి రవి గ్రామస్తులు గుండం సంతోష్ రెడ్డి, సురేందర్, శ్రావణ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళా



నవతెలంగాణ-సిద్దిపేట

స్వయంగా ఉపాధ్యాయ అనుభవం కోసమే స్వపరిపాల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట పట్టణంలోని శ్రీవాణీ స్కూల్ డైరెక్టర్ సి.హెచ్. సత్యం అన్నారు. ఉపాధ్యాయులుగా తమ పాత్రలపై పూర్తిస్థాయిలో విద్యార్థులు అవగాహన పెంచుకున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ స్వపరి పరిపాలన దినోత్సవంలో డిఈఓ గా మనీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ గా వరుణ్, కరస్పాండెంట్ గా ప్రదీప్ లు విధులు నిర్వహించారు. వారిలో మొదటి బహుమతి . జి సునైనా ,బి. నిహారిక, రెండోవ బహుమతి వి. అక్షిత , బి. ప్రణవి గెలుపొందారు. వారికి పాఠశాల కరెస్పాండెంట్ సి.హెచ్ సత్యం బహుమతి అందించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల, బెదిరింపులతో ఏమిచేయలేరు

- సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కాముని ఉమేష్ చంద్ర



నవతెలంగాణ-సిద్దిపేట

కుట్రలు కుతంత్రాలతో అక్రమ కేసులు పెట్టి హరీశ్ రావు, కేటీఆర్‌లను ఇబ్బంది పెట్టాలని చూస్తే బీఆర్ఎస్ కార్యకర్తలుగా చూస్తూ ఊరుకోమని సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కాముని ఉమేష్ చంద్ర అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో విలేకరులతో మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని నిండా ముంచడానికి రేవంత్ రెడ్డి పూనుకున్నాడని, తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాల్ చేయకుండా హరీశ్ రావు, కేటీఆర్ లు అడ్డుపడుతున్నారని అక్కస్సు పెంచుకున్న రేవంత్ రెడ్డి అక్రమ కేసులు పెట్టి జైల్లో వేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. అక్రమ కేసులకు ఏ మాత్రం భయపడేది లేదని, కేసులు, ఉద్యమాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్తేమి కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని సామాజిక వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-గజ్వేల్



అన్ని సామాజిక వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో మేర సంఘం అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సామాజిక వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా యువతకు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్, మేర సంఘం నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి







నవతెలంగాణ-బెజ్జంకి

భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని ఏఎస్ఐ శంకర్ రావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద ఏఎస్ఐ శంకర్ రావు ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, అయా వాహనదారులు సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడుపాలని సూచించారు. మద్యం తాగి, త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనం నడపడం చట్టారీత్యా నేరమని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ- రాయపోల్

ప్రజలు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని రాయపోల్ ఏఎస్ఐ దేవయ్య అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత వారోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడప రాదని, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహన దారులు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా ఉన్నత ఆశయాలతో చదువుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలపై మీ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలవిద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

మద్యం సేవించి వాహనాలు నడపరాదని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కుకునూరు పల్లి గ్రామంలో గల ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదు అని, అదేవిధంగా ఆటోలో పరిమితికి మించి వ్యక్తులను ఎక్కించుకోరాదు అని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అతి అతివేగంగా వాహనాలు నడపవద్దు అని ఆటో డ్రైవర్లకు కుకునూరుపల్లి ఎస్సై సూచించినారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఆటో డ్రైవర్లు ఉన్నారు.

రైతాంగానికిచ్చిన హామీలు అమలు చేయాలి

- తహసీల్దారుకు వినతిపత్రమందజేసిన బీజేపీ శ్రేణులు

నవతెలంగాణ-బెజ్జంకి



శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగానికిచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్ వద్ద రైతాంగాని కిచ్చిన హామీలను అమలు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి బీజేపీ శ్రేణులు వినతిపత్రమందజేశారు. హామీల అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతాంగం పక్షాన ఉద్యమాలు ఉధృతం చేస్తామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. కిసాన్ మోర్చా మండలా ధ్యక్షుడు రాచకొండ శ్రీదర్ రావు, నాయకులు సంగా రవి, శీలం వెంకటేష్, వడ్లూరీ శ్రీనివాస్, సాన వేణు,దొడ్ల ప్రశాంత్, బూత్ అధ్యక్షులు ఒగ్గు కనకయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా 5 కిలోల కణతి తొలగింపు

నవతెలంగాణ-దుబ్బాక

కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న దుబ్బాకకు చెందిన గుండ్ల అపర్ణకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా శుక్రవారం ప్రభుత్వ ఏరియా వంద పడక ఆసుపత్రిలో సూపరిండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ నేతృత్వంలో 5 కిలోల మల్టిపుల్ ఫైబ్రాయిడ్ కణతిని విజయవంతంగా తొలగించారు. ఈ ఆపరేషన్‌లో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం అప్పలాయ చెరువు గ్రామానికి చెందిన గట్టు రవీందర్ డిసెంబర్ 31న గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. శుక్రవారం మృతుని కుటుంబాన్ని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. వారి కుటుంబానికి అండగా నేను ఉంటా, అధైర్య పడవద్దు అని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గట్టు శ్రీనివాస్,బాలమల్లు, కొండల్, భాస్కర్ రెడ్డి, సత్తయ్య, గణేష్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సింగరాళ్ళ మల్లన్న జాతరకు ఏర్పాట్లు పూర్తి

- **గ్రామస్థులు ఎక్కడ ఉన్న జాతర సమయంలో గ్రామానికి చేరుకుంటారు**

నవతెలంగాణ-తొగుట

ప్రత్యేక కథనం.

కోరుకున్న భక్తులకు కోరికలు తీరుస్తూ కొంగు బంగారమైన సింగరాల మల్లన్న ఆలయం రోజు రోజుకి అభివృద్ధి కొనసాగుతుంది. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని జప్తి లింగారెడ్డిపల్లి గ్రామం లో 12వ తేదీ ఆదివారం రోజున శ్రీ సింగరాల మల్ల న్న జాతర బండ్లు ఊరేగింపు బోనాలతో గ్రామస్థులు ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ జాతర రోజున గ్రామస్తులు దేశంలో, ఇతర దేశాలకు, ఎక్కడికి వెళ్లినా ఈ ఉత్సవాల సమయంలో గ్రామానికి చేరుకుంటారు. ముఖ్యంగా ఈ ఆలయం చరిత్ర గురించి గ్రామస్థులు చెప్పిన విధానం తాత ముత్తాతల నుంచి ఈ ఆలయానికి ఒక ప్రతిష్ట ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో శతాబ్దాల క్రితమే చిన్న పాటి ఆలయం ఏర్పడి ఉందని పూర్వీకులు తెలిపినట్లు ఇప్పటికీ అంటుంటారు. ప్రస్తుతం ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దాతల ద్వారా ఆర్థిక సహాయాన్ని వెచ్చించి గుడి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆయ ప్రభుత్వాల, స్థానిక నాయకుల సహకారంతో సీసీ రోడ్లు, విద్యుత్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. శతాబ్దాల క్రితమే చరిత్ర కలిగిన మల్లన్న ఆలయం మహిమ గల్ల దేవుడని రోజు రోజుకు భక్తులు కోర్కెలు తీరుస్తూ కొంగుబంగారమై అందరి ఇల వేల్పుగా నిలుస్తున్నారని వారు తెలిపారు. సంక్రాంతి ముందు ఆదివారం రోజుల గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఇండ్లను శుభ్రం చేసుకొని ప్రత్యేక శ్రద్ధతో జాతర ఉత్సవాలు నిర్వహించుకుంటామని అన్నారు. జాతరకు వారం రోజుల ముందు జిట్టి కుంభాలు పోసి జాతర ఉత్సవాలు ప్రారంభిస్తాం. జాతర రోజున బండ్లు, బోనాలు, పోతరాజుల నృత్యాలతో జాతర ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. ఆలయా నికి రాతి గడప ఉండడంతో ఈ గ్రామం పరిసరాలలో ఇప్పటివరకు వడగళ్ల వాన కురిసిన సందర్భాలు లేవని పూర్వీకులు, ప్రస్తుత చెప్పుకొంటారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి జిల్లాలోని, ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మల్లన్నకు మొక్కులు తీర్చుకున్నారు.



ఆలయానికి ఈశాన్య దిశలో గుండం ఉందని అందులో ఏ సమయంలోనైనా నీరు ఉంటుంది. అందులో నీళ్ల ఉండడానికి ఆలయం కింది భాగంలో నుండి రెండు దారల నీరు గుండం లోకి వస్తుందని, ఇది గమనించిన గ్రామస్తులు రెండు పైపులు ఏర్పాటు చేసి నీటి దారులను అందులోపడేలాగా చేశామని చెప్పారు. ఈ బావిలో నీరు తాగడం వల్ల వ్యాధుల నుండి విముక్తి కలుగుతుందన్నారు. ఆలయానికి మహర్దశ సంతరించుకుందని ప్రతి సంవత్సరం కొంత కొంత అభి వృద్ధి పనులు కొన సాగుతున్నాయి. ఈ సంవత్సరం చివరి దశకు చేరు కున్నాయని, వచ్చే సంవత్సరం మరింత అభివృద్ధి చేసి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతామని గ్రామ పెద్దలు తెలిపారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు

నవతెలంగాణ-సిద్దిపేట

ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని పాత వెంకటేశ్వర దేవాలయంలో ఆలయ కమిటీ ఉత్తర ద్వార దర్శనాన్ని భక్తుల కోసం ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఏడు ద్వారాల ఏర్పాటు చేసి స్వామివారిని దర్శించుకోవడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేయడంతో అవి భక్తులను ఆకట్టుకున్నాయి. దర్శనానికి వచ్చిన ప్రతి భక్తునికి లడ్డు, పులిహోర ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంప శ్రీనివాస్, నవీన్ కుమార్, పుల్లూరు శివకుమార్, కృష్ణమూర్తి, హరికిరణ్, యాద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని మోహినిపుర లో గల వెంకటేశ్వర దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా భక్తులతో ఉదయము నుండి సాయంత్రం వరకు కిటకిటలాడాయి. తెల్లవారుజామున వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లను పూజారులు శావాలో పుర వీధుల్లో తింపి, అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా దేవాలయ కమిటీ ఏర్పాట్లను చేశారు. మాజీ జెడ్పి చైర్ పర్సన్ రోజా శర్మ రాధాకృష్ణశర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, జిల్లా వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన వారికి ఆశీర్వచనాలు ఇచ్చారు.

నవతెలంగాణ-గజ్వేల్

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి, నియోజకవర్గ స్థాయి నేతలు కుటుంబ సమేతంగా వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గం కొడకండ్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి దంపతులు, గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి దంపతులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకండ్ల సుదర్శన్ రెడ్డి దంపతులు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నవతెలంగాణ-గజ్వేల్

ముక్కోటి ఏకాదశి సందర్భంగా గజ్వేల్ పట్టణంలో పలు దేవాలయాల్లో భక్తులు పోటెత్తారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర దేవాలయంలో తెల్లవారుజామున భక్తులు బారులు తీరారు. ఉత్తర ద్వారా భక్తులను స్వామి దర్శనానికి పంపడం జరిగింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర దేవాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వచ్చిన వేలాది భక్తులకు ముఖ ద్వారా దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అన్నదానం, లడ్డు ప్రసాదం అందించడంతోపాటు అక్కడే భక్తులకు టిఫిన్ ఏర్పాటు చేశారు.ఉదయం 5:30 నుండి దర్శనాలు ప్రారంభించగా సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగుతున్నాయి.

నవతెలంగాణ-వర్గల్

ప్రసిద్ధ వర్గల్ శ్రీ కళ్యాణ వెంకటేశ్వర క్షేత్రంలో వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి వైభవం సంతరించుకుంది. ఆలయ వ్యవస్థాపక చైర్మెన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేదమూర్తులైన బ్రాహ్మణోత్తముల మంత్రోశ్చరణల మధ్య సతీసమేతులైన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు, లక్ష తులసి అర్చన, శ్రీ భూదేవి శ్రీదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. కాగా ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో క్షేత్రానికి శుక్రవారం తెల్లవారు జామునుండే తరలిరావడం కనిపించింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు యాయవరం రాజశేఖర శర్మ, దాచేపల్లి వెంకట కృష్ణారావు, బొమ్మిడాల సత్యనారాయణ, ఇర్రి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం నంగునూరు మండలం లోని వివిధ గ్రామాల్లో ఘనంగా వైకుంఠ ద్వార దర్శన వేడుకలు జరిగాయి.పాలమాకుల,నంగునూరు వెంకటేశ్వర ఆలయంలో ఉదయం ఐదు గంటలకు ఆలయ నిర్వాహకులు మంగు రాధా కిషన్ రావు, గ్రామ పురోహితులు ఆదిరాల సాయినాథ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు .స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయంలో ఊరేగింపు చేసి అనంతరం ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ద్వారం తెరిచి భక్తులకు ప్రవేశం కల్పించారు. ప్రముఖ వ్యాపార వేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి,మండల విద్యాశాఖాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామస్వామి గౌడ్,తదితర భక్తులు ఉత్తర ద్వారం ద్వారా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని గాగిల్లాపూర్, గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువై ఉన్న వెంకటేశ్వర స్వామి విగ్రహానికి చేర్యాల గ్రామానికి చెందిన భువనేశ్వరి స్టీల్ షాప్ ప్రొప్రైటర్ వంగర శ్వేత వేణుగోపాల్, దంపతులు మకర తోరణాన్ని స్వామివారికి బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి శ్వేత వేణుగోపాల్ దంపతులు స్వామివారికి మకరతోరణాన్ని అలంకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గాగిలాపూ ర్ గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం ఎంతో పవిత్రమైనదని వారు తెలిపారు. వెంకటేశ్వర స్వామి కి మకర తోరణం చేయించడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆగాచారి, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-కొండపాక

ముక్కోటి ఏకాదశి వేడుకలను కొండపాక మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఉత్తర ద్వారా దర్శనాన్ని ఉదయం ఐదు గంటలకు వేదమంత్రాల మధ్య ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామివారి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బెజగామ వెంకటేశం, గట్టు రవీందర్ తదితరులు ఉన్నారు. మండలంలోని వైకుంఠ ద్వార దర్శనం జరిగింది ఆయా దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.

నవతెలంగాణ-మద్దూరు

ముక్కోటి వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని మద్దూరు, మండల కేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ,ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పానుగంటి తిరుపతయ్య, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

మిరుదొడ్డి మండల వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లడంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులు ఉదయం నుండి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా పురోహితులు రాజగోపాల్ చారి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి ఎంత ప్రాముఖ్యత కలిగిందన్నారు భక్తులు భక్తి శ్రద్ధతో పుష్పొత్సవ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్,

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సిద్దిపేట మండలం పుల్లూరు స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవం వైభవంగా జరిగింది అని దేవాలయ వంశపారంపర్య అర్చకులు కలుకుంట్ల రంగాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రమంలోనే పుల్లూరు స్వయం భూ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం లో వైకుంఠ ఏకాదశి ఉత్సవం.. ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమం ఘనంగా జరిగింది. 4 గంటలనుండే దేవాలయం లో ప్రత్యేక పూజలు ప్రారంభం అయ్యాయి. స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి కి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించారు. భక్తులకు ఉత్తర ద్వారం గుండా దర్శనానికి అనుమతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొడిచేటి రామకృష్ణ, పొడిచేటి శ్రీనివాసా చారి, కలకుంట్ల వెంకట్, కలకుంట్ల నచికేత,విజయ్ కుమార్, దేవాలయ కమిటీ చైర్మన్ పుల్లూరు కనకయ్య, కుమ్మరి రాములు, కుమ్మరి వెంకటి, పాల్గొన్నారు..


నవతెలంగాణ-మర్కుక్

రాష్ట్ర వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు.మర్కుక్ మండలంలోని రంగనాయక స్వామి, పాములపర్తిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మాజీ ఎంపీపీ తాండ పాండుగౌడ్, బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్, నాయకులు హరిపంతులు, నరేందర్ రెడ్డి, తదితరులున్నారు.

బీరప్ప బస్తీ సమస్యలు పరిష్కరించాలి


నవతెలంగాణ-ఐడిఎబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో ఎన్నో రోజులుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ వార్డు సభ్యుడు టి.భాస్కర్ కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ మంగతాయారుకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేని ప్రాంతాల్లో వేయాలని సూచించారు. అలా కాకుండా ఉన్న మంచి రోడ్లను, డ్రైనేజీలను మళ్లీ వేయడం పట్లనే అసహనం వ్యక్తం చేసి పనులను అడ్డుకున్నట్లు తెలిపారు. వార్డులో సమస్యలు.. అక్కడ నివసించే ప్రజలకే తెలుస్తాయని ఆటు పక్క వీధి వాళ్ళకి ఏం తెలుస్తుందని ఓ పక్కన అభివృద్ధి చేస్తూ మరో పక్కన ఎండబెడుతున్నారని అలా చేయడం సరి కాద ని ఒక వార్డ్ కి నిధులు కేటాయించినప్పుడు ఎక్కడైతే అత్య వసరం ఉందో గమనించి అభివృద్ధి దిశలో వార్డు ని తీసుకె ళ్లాలని ఇప్పటికైనా ఎక్కడైతే అత్యవసరంగా సమస్యలు నెలకొన్నాయో



అక్కడే పనులను చేపట్టాలని ఒకరోజు మా వార్డు వచ్చి విజిట్ చేయాలని విజ్ఞప్తి చేశారు విజ్ఞప్తి చేశారు. కాగా కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కమిషనర్ స్పందిస్తూ... అభివృద్ధి పనులు పూర్తయిన పిదప తిరిగి ప్రజా సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకునేలా కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. కార్యక్ర మంలో కాలనీవాసులు నరసింహ, నవీన్, భూపి, రాములు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో చదివిఉన్నత స్థాయికి ఎదగాలి



నవతెలంగాణ-చౌటకూర్ : గురుకుల పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సింగూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆగమ య్య సూచించారు. పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల ఇంపాక్ట్ సమావేశం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభు త్వం విడుదల చేసిన గురుకులాల్లో 5వ తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్ష మరియు 6వ, 7,8,9 వ తరగతుల్లో మిగిలిపోయిన బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వాని స్తూ విడుదల చేసిన కరపత్రాన్ని తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025-2026 విద్యా సంవత్స రానికి సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష దరఖాస్తును ఆన్ లైన్లో, మీ సేవ కేంద్రాలోనూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు నిమిత్తం రూ.100 పరీక్ష ఫీజు, కుల, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఫొటోలు సంతకం ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి 1 ఫిబ్రవరి 2025 చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష 23 ఫిబ్రవరి 2025 న ఉంటుందన్నారు. తల్లిదండ్రులుగా పిల్లలకు మంచి విద్యను అందించాలన్నారు. ఇంటి పక్క విద్యార్థులను, బంధువుల విద్యార్థులకు, సమీప ప్రాంతాల్లో ఉన్న వారికి వీలైనంత మేరకు ప్రవేశ పరీక్ష పట్ల అవగాహనా కల్పించాలని కోరారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-చేర్యాల

స్వచ్ఛత మన సంస్కృతి అనే నినాదంతో జిల్లా కలెక్టర్ ఆదేశం, జిల్లా పంచాయతీ అధికారి సూచనల మేరకు సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మహిళా సంఘాల సహకారంతో గ్రామాల్లో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండీ.మహబూబ్ అలీ తెలిపారు. శుక్రవారం అన్ని గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది స్వచ్ఛత పైన ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ముగ్గుల పోటీలను స్వచ్ఛత మన సంస్కృతి అనే నినాదంతో చేసుకోవడం జరుగుతుందన్నారు. సాంప్రదాయ ముగ్గులతో పాటుగా స్వచ్ఛత అంశాలను చేర్చడం జరిగిందని, ముఖ్యంగా పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ అంశాలను రంగవల్లుల ద్వారా మహిళలు ప్రదర్శించారని అన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలకు పర్యావరణహితమైన బహుమతులను (స్టీల్ బాక్సులు, స్టీల్ వాటర్ బాటిల్, ప్లేట్లు) గ్రామపంచాయతీ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయవంతం చేయడానికి ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయడం జరుగుతుందన్నారు.

గజ్వేల్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్ నందు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కళాశాలలో ముగ్గుల పోటీని మహిళా సాధికారిక విభాగం కన్వీనర్ డాక్టర్ సుజాత సాంస్కృతిక శాఖ కన్వీనర్ సిహెచ్ ఉమారాణి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులు అందరికీ కళాశాల తరపున పోటీకి సంబంధించిన రంగులను, ముగ్గులను అద్దడం జరిగింది. విద్యార్థులు అందరూ ఉత్సాహంతో పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు.ఆకర్షణీయమైన ముగ్గులను వేసి అందరిని ఆకర్షించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనిత అబ్రహం , వైస్ ప్రిన్సిపల్స్ కమలా క్రిస్టియన, శ్రీలత, కళాశాల అధ్యాపక బృందం అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కొండపాక: కొండపాక మండలం థమక్కపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రంగవల్లులు తిలకించారు. అనంతరం అందమైన రంగవల్లులను వేసిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు వారి నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. దానితోపాటు తెలుగు పండుగలు సంప్రదాయ విలువలను విద్యార్థులకు చిన్న వయసు నాటి నుండి నేర్పించడం పట్ల ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు . గ్రామపంచాయతీ పచ్చదనం పరిశుభ్రత ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు బహుమతులను అందజేశారు . ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి , ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మిరుదొడ్డి : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అక్బర్పేట భూంపల్లి మండలం లోని పలు పాఠశాలలో విద్యార్థులు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీతోపాటు విద్యార్థులు పతంగులు ఎగరవేస్తూ అంగరంగ వైభవంగా పండుగ నిర్వహించుకున్నారు. అక్బర్ పేట భూంపల్లి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భూంపల్లి, వోతే గ్రామాల్లోని పాఠశాలలో సంక్రాంతి పండుగ ను పురస్కరించుకొని ముందస్తుగ విద్యార్థినీలకు ముగ్గుల పోటీలను అదేవిధంగా విద్యార్థులకు పతంగుల పండుగ నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కిషన్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ బాలకృష్ణ, ఇందిర, రాజేశ్వరి వెన్నెల, సరిత నవిత మొదలైన వారు పాల్గొన్నారు.

నంగునూరు : రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మహిళలకు పోటీలు చేపట్టారు. గ్రామ ప్రత్యేక అధికారులు సమావేశానికి హాజరై బహుమతులు అందజేశారు. పాఠశాలల్లో ముందస్తుగా సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు పోటీలు చేపట్టి బహుమతులు అందజేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు తదితరులు హాజరైనారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు

నవతెలంగాణ-సిద్ధిపేట

సంక్రాంతి పండుగ సందర్భంగా మైత్రివనంలోని ఆధ్య పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొని, విజేతలకు బహుమతులను మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండం సంపత్ రెడ్డి, పాల సాయిరాం, పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మెరిడియన్ పాఠశాలలో.. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక మెరిడియన్ పాఠశాలలో ముందుగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు అందమైన రంగవల్లులతో ప్రాంగణాన్ని అలంకరించారు. అబ్బాయిలు పాఠశాల మైదానములో గాలి పటాలు ఎగురవేసి సంబురాలు నిర్వహించారు. కోడిపందాలు, గంగిరెద్దుల సెట్టింగులతో పాఠశాల వాతావరణం మొత్తం గ్రామీణ శోభను సంతరించుకుంది. కుండల తయారీ విధానానికి సంభందించిన కుమ్మరి చక్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హరిదాసుల వేషదారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. సంక్రాంతి పండుగకు సంబందించి నృత్యాలు చేసి అలరించారు. పిల్లలు, ఉపాధ్యాయులు భోగి మంటలు ఏర్పాటు చేసి, కోలాటం ఆడారు. ఉత్తమ రంగవల్లులు వేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజా వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

చేర్యాల: చేర్యాల పట్టణ కేంద్రంలోని ఓక్లే ఇంటర్నేషనల్ స్కూల్లో శుక్రవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేసి భోగి మంటలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పతంగులను ఎగురవేశారు. విద్యార్థులు హరిదాసుల వేషాధారణలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం వైవి రావు, యాదగిరి, ప్రిన్సిపాల్ ప్రియాంక రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గజ్వేల్: గజ్వేల్ మండలంలోని సింగాటం ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తు సంక్రాంతి సంబరాలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ శుక్రవారం పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులందరూ పాఠశాల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేస్తూ , గాలిపటాలు ఎగరవేశారు. రంగవల్లుల పోటీలో మొదటి మూడు బహుమతులు ఉమా ,నిత్య, ప్రసన్య గెలుచుకున్నారని వీరికి పాఠశాల ఉపాధ్యాయ బృందం బహుమ తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుకునూరి శేఖర్, యశోద, కృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జంకి : మండల కేంద్రంతో పాటు బేగంపేట సెయింట్ జోసెఫ్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థినిలు ముగ్గుల పోటిల్లో పాల్గొన్నారు. విద్యార్థులు పతంగులు ఎగురవేస్తూ సంబురాలు నిర్వహించుకున్నారు. అయా పాఠశాలల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

కొండపాక : కుకునూరు పల్లి మండలం తిప్పారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగవల్లులు , భోగి మంటలు, పాలు పొంగించుట పతంగుల ఎగరవేయడం కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంది. రంగ వల్లుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగార్జున మిల్క్ పార్లర్‌ను ప్రారంభించిన చైర్మెన్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ పట్టణంలోని హనుమకొండ రోడ్‌లో నాగార్జున మిల్క్ పార్లర్‌ను శుక్రవారం జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 18 ఏండ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో గల రైతుల నుంచి స్వచ్ఛమైన పాలను సేకరించి శుద్ధిచేసి పాలు పాల ఉత్పత్తులను తయారు చేసి పాలు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో మంచి పేరు తెచ్చుకొన్న నాగార్జున డైరీ పలు సేవా కార్యక్రమాలను అమలుపరుస్తూ, వినియోగదారులకు అందుబాటులో ఉంటూ ముందుకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనిత, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, నాగార్జున డైరీసీఈఓ బారాజ్ కృష్ణ ప్రసాద్, మేనేజర్ వెనిశెట్టి శివకుమార్, అసిస్టెంట్ మేనేజర్ గొర్ల విజయ్ కుమార్, వెంకటేష్, రాకేష్ నాగార్జున మిల్క్ పార్లర్ ఏజెంట్ నోముల బాలయ్య వెంకటేశులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో శుక్రవారం రంగోలి, ఫుడ్, కైట్ ఫెస్టివల్ కార్యక్రమాలనుఉత్సాహంగా చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.బుచ్చిబాబు తెలిపారు. పాఠశాల విద్యార్థులచే ఏర్పాటుచేసిన 12 స్టాల్స్‌లలో విద్యార్తులే స్వయంగా చేసిన పలు రకాల పిండి, తీపి వంటకాలను ప్రదర్శనలో పెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ బుచ్చిబాబు అభినందించారు.



అనంతరం పతంగులు, రంగవల్లుల కార్యక్రమాన్ని విద్యార్థులు ఉత్సాహంగా చేసుకున్నారు. ఆయన వెంట మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ బేతి భాస్కర్, సీఆర్ పీ నవీన్ పలువురున్నారు.

డిగ్రీ కాలేజీకి అటానమస్ హెూదా గజ్వేల్ కే గర్వకారణం

-జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హెూదా రావడం గజ్వేల్ కే గర్వకారణం అని డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థి జాతీయ యువజన అవార్డు గ్రహీత సిద్దిపేట జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులు పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల గజ్వేల్‌కు స్వయం ప్రతిపత్తి కలిపిస్తూ యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల క్రితం గజ్వేల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుని ఎన్ఎస్ఎస్ వాలంటరీగా జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయి క్యాంప్‌లో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు.

కుల సంఘాలకు టెంట్‌హౌస్ సామగ్రి వితరణ

నవతెలంగాణ-జిన్నారం



జిన్నారం 8వ, 9వ వార్డులో గల కుల సంఘాలకు లక్ష రూపాయల విలువగల టెంట్‌హౌస్ , వంట సామాన్లను మాజీ సర్పంచ్ అంతిరెడ్డిగారి లావణ్య శ్రీనివాస్‌రెడ్డి విరాళంగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి బృందానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్, కోదండ రామాలయం చైర్మన్ రెడ్డి గారి భోజి రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, మాజీ 8వ వార్డు సభ్యులు ఏర్పుల లింగం,మంద రమేష్, నీలం మోహన్,బ్రహ్మేందర్ గౌడ్, నిఖిల్ గౌడ్ నర్సింగ్ రావు, మల్లేష్, వెంకటేష్, కిషన్, అశోక్, సురేష్, భాస్కర్, యాదగిరి, భాస్కర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

టేబుల్ ఎజెండా ఎందుకు పెట్టడం లేదు

మున్సిపల్ సమావేశంలో కమిషనర్‌పై కౌన్సిలర్ల ఆగ్రహం

నవతెలంగాణ-మెదక్ టౌన్



టేబుల్ ఎజెండా ఎందుకు పెట్టడం లేదని కమిషనర్‌పై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఆయా వార్డు కౌన్సిలర్లు సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. కొన్ని సమస్యలు అకస్మాత్తుగా వస్తాయని అలాంటి వాటిపై చర్చించి సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత మనది కాదా అని అన్నారు. అధ్యక్షులు చంద్రపాల్ కలగజేసుకొని టేబుల్ ఎజెండా గత 1981 నుంచి అమలు చేస్తున్నామని అత్యవసర సమస్యలు కౌన్సిలర్‌లతో చర్చించి తీర్మానం ప్రవేశపెడుతున్నామని మీరు కొత్త కొత్త రూల్స్ తీసుకురావడం బాగాలేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ వద్ద దేవాలయాలు నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలని 21వ వార్డు కౌన్సిలర్ మేఘమాల, కృష్ణా రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన అధ్యక్షులు కేటాయించే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది ఆయా మతాలకు సంబంధించిన దేవాలయాలను నిర్మించుకునేందుకు గతంలోనే స్థలాన్ని సూచించాం, ఇటీవల మసీద్ కట్టుకుంటే ఎవరు అభ్యంతరం చెప్పలేదన్నారు. నూతన ఇళ్ల నిర్మాణంకు అనుమతులు ఇవ్వడం లేదని 1, 3 వార్డు కౌన్సిలర్లు భీమిలి కిశోర్ కుమార్, విశ్వం సభ దృష్టికి తీసుకవచ్చారు. ఇందుకు స్పందించిన టీపీవో భూపతి, ఆర్ఐ జానయ్య గౌడ్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ పత్రాలను నమోదు చేస్తేనే అనుమతులు ఉంటాయని తెలిపారు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, పాలకవర్గం కాల వ్యవధి త్వరలో ముగుస్తున్నందున పెండింగ్‌లో ఉన్న పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయడంతో పాటు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్లు రుక్మిణి, లలిత, జయరాజ్‌లు కోరారు. ఇటీవల వార్డు అధికారులుగా నియమితులైన వారికి కౌన్సిల్ సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం అధ్యక్షులు చంద్రపాల్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు, నీటి సరఫరా, మురుగు కాలువలు, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ, పన్ను వసూలు తదితర పనుల్లో పర్యవేక్షణ ఉండడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్పంచుకొని పట్టణాభివృద్ధికి కృషి చేయాలని వార్డు అధికారులకు సూచించారు. సమావేశంలో కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, పురపాలిక డీఈఈ మహేశ్, మేనేజర్ భవాని, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

